ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి నేటికి సరిగ్గా ఏడాది అయ్యింది. ఈ ఏడాదిలో జిల్లా ప్రజలకు జరిగిన మేలేమిటి!? ఐదేళ్ల వైసీపీ పాలనతో పోల్చితే ప్రజలకు కొత్తగా ఒరిగిందేమిటి!? అనే కోణంలో పరిశీలిస్తే ఏడాది కాలం పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం జిల్లా ప్రజలకు ప్రశాంతతను ఇచ్చింది. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు లేని పాలన అందించింది. మౌళిక వసతులకు పెద్ద పీట వేసింది. గుంతలమయమైన జిల్లా రహదారులకు వందల కోట్ల రూపాయలతో మరమ్మతులు చేసింది. డొక్కు బస్సుల స్థానంలో కొత్త బస్సులను తెచ్చింది. యువతకు ఉద్యోగ కొలువులు ఇప్పించింది. ఇచ్చిన మాట ప్రకారం అవ్వా తాత పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచింది. నిర్వీర్యమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పోరేషన్లకు జీవం పోసింది. మళ్లీ సబ్సిడీ రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పారిశ్రామిక ప్రగతిని పరుగులెత్తించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఏడాది కూటమి పాలనలో జిల్లా అభివృద్ధిని పట్టాలెక్కించింది. గురువారం నాటికి కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం...

- ఆంధ్రజ్యోతి బృందం



ప్రగతి పరుగు..
ఏడాదిలో మెరుగు

కూటమి పాలనలో కూతపెడుతున్న అభివృద్ధి



యువతకు ఉద్యోగాలు

వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే మెగా డీఎస్సీ నిర్వహించింది. జిల్లాలో 673 టీచర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఇక వైసీపీ ప్రభుత్వం 2022లో పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023, జనవరి 22న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. అప్పటి నుంచి ఫిజికల్ టెస్టులు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలల వ్యవధిలోనే ప్రిలిమినరీ పరక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది, జనవరి నెల 30 నుంచి పోలీసు పెరేడ్ మైదానంలో ఫిజికల్ టెస్టులు నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి మెయిన్ పరీక్షను పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసింది. త్వరలోనే ఎంపికైన కానిస్టేబుళ్లు ఉద్యోగాల్లో చేరనున్నారు.



వైసీపీ హయాంలో కావలి-తుమ్మలపెంట రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారులు హడలిపోయేవారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరగడం, వాహనదారులు ఆసుపత్రిపాలుకావడం జరిగేది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.14.76 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఈ పనులు ముగింపు దశకు చేరుకోనున్నాయి.

ఆర్టీసీకి కొత్త కళ

వైసీపీ హయాంలో కొత్త బస్సులు కావాలని అధికారులు పదేపదే ఇండెంట్లు పెడితే ఐదేళ్లలో రెండు బస్సులను జిల్లాకు పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నెల్లూరు రీజియన్‌కు 133 కొత్త బస్సులు వచ్చాయి. అత్మకూరు డిపోకు 9 బస్సులు, కందుకూరుకు 25,



కావలికి 12, నెల్లూరు-1వ డిపోకు 31, నెల్లూరు-2వ డిపోకు 19, రాపూరుకు 7, ఉదయగిరికి 30 బస్సులు వచ్చాయి.

● జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్ల భవనాలకు మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.9.32 కోట్లు మంజూరు చేసింది. ఇక 79 బీసీ సంక్షేమ హాస్టళ్లలో 32 హాస్టళ్లకు ప్రభుత్వం రూ.72 లక్షలు కేటాయించింది.

బాగుపడిన రోడ్లు


ఐదేళ్లపాటు కనీస నిర్వహణ లేక ఏర్పడిన గోతులకు తట్టెడు మన్నువేసే దిక్కులేక దారుణంగా ఉన్న రోడ్ల కోసం వంద కోట్లకుపైగా ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.40 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు బాగుపడగా, 84 కోట్లతో ఎన్‌డీబీ రోడ్ల పనులను చేపట్టింది. 34 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులు చేస్తోంది. పంచాయతీరాజ్ పరిధిలో కొత్త రోడ్ల కోసం 60 కోట్లు మంజూరు చేసింది.

వ్యవసాయ యాంత్రీకరణ

కూటమి ప్రభుత్వం రైతులకు వ్యక్తిగతంగా ఇచ్చే విధానాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది 1452 యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీ కింద రైతులకు అందజేసింది. పరికరాలు ఎంపిక చేసుకొని కొనుగోలు చేసుకునే అవకాశం రైతులకు కల్పించింది. 50 శాతం సబ్సిడీ మొత్తాన్ని రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రూ.12వేల అన్నదాత సుఖీభవ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచింది. ఇందులో కేంద్రం వాటా 6వేలు కాగా 14వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నెలలో ఈ మొత్తం రైతుల ఖాతాలో జమకానుంది.

● ఈ నెలలోనే అమ్మఒడి పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాలో జమ కాబోతుంది. రైతు భరోసా పథకం మొత్తాన్ని 20వేలుకు పెంచింది. ఆ మొత్తం ఈ నెలలోనే పడనుంది.

● డిజిటల్ లక్ష్మి (డిజి లక్ష్మి) పథకం ద్వారా ప్రభుత్వం పొదుపు మహిళ చేత కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తోంది. ఈ సెంటర్ల ద్వారా రూ.30-40 లక్షల ఆదాయం పొదుపు మహిళకు వస్తుంది. డిగ్రీ చదివిన పొదుపు సంఘానికి చెందిన మహిళను ఈ డిజీ లక్ష్మి పథకానికి ఎంపిక చేశారు.



● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధాప్య, మత్స్యకార, కల్లుగీత కార్మిక, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారులు, హెచ్‌ఐవీ బాధితులకు ఇస్తున్న పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి 4వేలకు పెంచింది. దివ్యాంగుల పెన్షన్‌ను రు.3వేల నుంచి రూ.6వేలకు పెంచింది. జిల్లాలో 3,05,804 మంది సామాజిక పెన్షనర్లు ఉండగా ప్రతి నెలా వీరికి రు.132.37 కోట్లు అందిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే 99 శాతం మందికి పెన్షన్ అందుతోంది.

● 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.51.81 కోట్లతో 1240 మంది లబ్ధిదారులకు పలు యూనిట్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో రూ.20.46 కోట్లు సబ్సిడీ, రూ.28.75 కోట్లు బ్యాంకు రుణాలు, రు.2.59 కోట్లు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించారు. త్వరలో లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు కానున్నాయి.

● బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు 1328 యూనిట్లు, ఈడబ్ల్యుఎస్‌కు 410 యూనిట్లు, మేదర, కుమ్మరులకు 100 యూనిట్లు, కాపులకు 231 యూనిట్లు, జనరిక్ మందుల షాపులు 96 యూనిట్లు జిల్లాకు కేటాయించారు. అలాగే, బీసీ కార్పొరేషన్ ద్వారా 26 ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒక్కో కేంద్రంలో 72 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

● మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 1449 మంది లబ్ధిదారులకు రూ.11.15 కోట్ల సబ్సిడీతో రూ.22.31 కోట్ల రుణలక్ష్యాన్ని ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించింది. యూనిట్ విలువ రూ.1లక్ష నుంచి 8లక్షల వరకు ఈ స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయనున్నారు.

● వర్క్‌ఫ్రం హోం సర్వే పేరుతో జిల్లాలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న 7.48లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో ఇంటి వద్దనే పని చేస్తున్న వారు 14,182 మంది ఉన్నారు. 2,18,898 మంది వివిధ రకాల పనుల్లో ఉన్నారు. జిల్లాలో 5,95,817 కుటుంబాలు ఉండగా, 25.67 లక్షల జనాభా ఉంది.

● పేద మహిళలకు చేయూత ఇస్తూ మెప్మా ఆధ్వర్యంలో తృప్తి క్యాంటీన్లను రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు.

కడుపు నిండుతోందయ్యా!



ఐదు రూపాయలకు ఏం వస్తుందో చెప్పండయ్యా. ఇదిగో ఇక్కడ మాత్రం కడుపు నిండా భోజనం దొరుకుతోంది. మాలాంటి పేదలకు ఇంత కన్నా ఇంకేం కావాలి. ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం దొరుకుతోంది. హోటల్లో భోజనం చేయలని వారికి అన్నా క్యాంటీన్ ఓ వరం.

- పైడి బాలయ్య, వైకుంఠపురం, కావలి

వైద్య ఖర్చులకు ఊతం



కొన్నేళ్లుగా నేను కిడ్నీల సమస్యతో బాధ పడుతున్నాను. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. నా వైద్య ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుండటంతో వైద్యఖర్చులకు ఎంతో ఉపయోగపడుతోంది.

- చెవుల లక్ష్మి, ఉదయగిరి

వేగంగా పారిశ్రామిక అడుగులు

● రామాయపట్నం పోర్టు అనుసంధానంగా అంతర్జాతీయ సంస్థలైన బీపీసీఎల్ దాదాపు రూ.90వేల కోట్లతో ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. అదేవిధంగా రూ.43వేల కోట్ల పెట్టుబడులతో ఇండోసోల్ (సోలార్ ప్యానల్స్ తయారీ) కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చారు. వీటితోపాటు జాన్సన్ ఇన్‌ఫ్రా,ఉత్కర్ష లిమిటెడ్, శ్రీచక్ర లిమిటెడ్, హెచ్‌పీసీఎల్, జేఎస్‌డబ్ల్యూ వంటి అనేక అంతర్జాతీయ పరిశ్రమలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నాయి అదేవిధంగా మనుబోలు ప్రాంతంలో విశ్వసముద్ర, క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ, ఎస్‌ఆర్‌సీ యుకోటెక్స్ లిమిటెడ్ కంపెనీల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకొన్నాయి.



ఆత్మకూరు : నారంపేట ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.(ఫైల్)

● ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటులో భాగంగా ఇప్పటికే భూసేకరణ పూర్తిచేశారు. ప్రతి పార్క్ 50 నుంచి 100 ఎకరాల్లో ఉండేలా చర్యలు చేపట్టారు. నెల్లూరు నగరంలో మాత్రం 2.4 ఎకరాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్‌ఎఫ్‌సీ) నిర్మించేందుకు ప్రభుత్వం రూ.12కోట్లు విడుదల చేసింది.

● ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో దాదాపు 2700 ఎకరాల భూ సమస్యలు, కోర్టు కేసులతో 1997 నుంచి నిలిచిపోయి ఉన్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించింది. దీంతో ఈ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు 12 అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఆమంచర్లలో అటవీ శాఖ అడ్డంకులు తొలగడంతో తొలుత 100 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్‌కు భూమిని కేటాయించారు. క్రిష్ణపట్నంపోర్టు సమీపంలోని 1500 ఎకరాల రిలయన్స్ భూముల సమస్య పరిష్కరించడంతో ఇక్కడ సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమను పెట్టనున్నట్లు అనిల్ అంబానీ ప్రకటించారు.

● కాకుటూరు ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెడీమేడ్ గార్మెంట్స్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రూ.10కోట్లు మంజూరయ్యాయి. అలాగే ప్రింటింగ్ క్లస్టర్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

● రాష్ట్రంలో ఎక్కడైన పరిశ్రమ స్థాపించాలనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతోపాటు అంతర్జాతీయంగా పారిశ్రామికవేత్తలను సైతం ఆకట్టుకొనేలా ఇండస్ట్రీయల్ ప్రాక్స్ పాలసీ 4.0ని రూపొందించారు. ఇందులో ప్రైవేటు భూమి కొనుగోలు చేసిన వారికి ఎకరాకు రూ.3లక్షల సబ్సిడీ ఇస్తారు. అలాగే అనేక చార్జీల్లో 100 శాతం రాయితీలు, భూమి కొనుగోలు చేసిన వెంటనే పారిశ్రామికవేత్త పేరుతో సేల్‌డీడ్ చేయడం లాంటి విధానాలు అమలులోకి వచ్చాయి.



ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, రైతులు, టీడీపీ నాయకులు

ఏరువాక సాగించారు !

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రావులుకొల్లు గ్రామంలో ఏరువాక పౌర్ణమిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖాధికారిణి పీ. సత్యవాణి ముందుగా రైతులకు అధిక దిగుబడులు రావాలని ఆకాంక్షిస్తూ ఎడ్లతో పొలాన్ని దున్ని ఏరువాక సాగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమిని జరుపుకోవడం రైతులకు ఆనవాయితీగా వస్తున్నదని, ఈ సందర్భంగా ఎడ్లను, అరకలను పూజించి నాగలికట్టి భూమిని దున్నుతుంటారని తెలిపారు. వర్షరుతువు ఆరంభంలో వచ్చే ఏరువాక పౌర్ణమి రోజున రైతులు దుక్కులు దున్ని పంటలు పండిస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయశాఖ పచ్చిరొట్ట విత్తనాలు, పీఎండీఎస్ కిట్లు, భూసార పరీక్షలు ఆధారంగా జింకు, జిప్సంను రాయితీతో అందచేస్తున్నదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో ఇసుక తవ్వకాలపై
మైనింగ్ శాఖ దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● పలు ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా గుంతలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పెన్నానదిలో ఇసుక తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. జాతీయ గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నదుల్లో ఇసుక తవ్వకాలు నిషేదం. అయితే, జిల్లాలోని పెన్నానదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్టు ఈ నెల 9వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'డోంట్‌కేర్' శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు జిల్లావ్యాప్తంగా దాడులు చేశారు. నదుల్లోకి ప్రవేశించే ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా మైనింగ్ ఆర్‌ఐ స్వాతి ఆధ్వర్యంలో అధికారుల బృందం గుంతలు తీయించారు. 8 స్టాక్ పాయింట్లలో మాత్రమే ఇసుక లభ్యమవు తుందని, అక్కడ నుంచే ఇసుక తరలించేందుకు అనుమతి ఉందని నెల్లూరు ఆర్డీవో అనూష తెలిపారు. అలాకాకుండా పెన్నానదిలోకి ప్రవేశించి ఇసుక తరలించేందుకు యత్నిస్తే క్రిమినల్ చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జిల్లాలో ఇసుక అందుబాటులో ఉన్న స్టాక్ పాయింట్లు

ఇసుక నిల్వ కేంద్రం	మండలం	టన్ను ధర	ఫోన్ నెం. (రూ.లలో)
పోతిరెడ్డిపాళెం	కోవూరు	250	9533111199
సంగం	సంగం	250	9866722126
సూరాయపాళెం-1	పొదలకూరు	250	7997997109
సూరాయపాళెం-2	పొదలకూరు	250	9440492441
భీమవరం	ఉలవపాడు	184	9494427678
పల్లెపాడు	ఇందుకూరుపేట	82	9000233585
మినగల్లు	బుచ్చి	93	9000233585
విరువూరు	పొదలకూరు	93	7997997109

జిల్లాలో మరో రెండు
కరోనా కేసులు

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం మరో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. నగరానికి చెందిన ఇద్దరు యువతులు కరోనా బారినపడినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లాలో మొత్తం కొవిడ్ కేసుల సంఖ్య 11కు చేరింది. వీటిలో అత్యధికంగా నెల్లూరు నగరంలోనే 7 కేసులు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో కొవిడ్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మాలకొండ ఆలయ డీసీగా చంద్రశేఖర్

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అన్నవరం దేవస్థానం డీసీగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడున్న కేవీ.సాగర్‌బాబు చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయ డీసీగా బదిలీపై వెళ్లారు.

గరుడుడిపై వేదగిరీశుడు

● పౌర్ణమి గిరి ప్రదక్షిణ



జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా వేదగిరి క్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామి బుధ వారం చిన్న గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. ముందుగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం దేవేరులు, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించారు.

- నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి)

వైభవంగా రంగడి వసంతోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శ్రీవారి వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి నవకలిశ స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా జరిగింది. అనంతరం విశేష అలంకరణ, దివ్య ప్రభంద ఘోష్టి, ఆస్థాన సేవ, శాత్తుముర్రై జరిగాయి. ఉభయకర్తలుగా దేవీ సుబ్రహ్మణ్యం కుటుంబం వ్యవహరించింది. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

ఆటలకు టాటా... ఇక బడి బాట!

● నేడు పాఠశాలల పునఃప్రారంభం



49 రోజుల విరామం తర్వాత బడి తలుపులు గురువారం తెరుచుకోనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో పిల్లలు స్కూళ్ల బాట పట్టనున్నారు. నిశ్శబ్దం ఆవహించిన పాఠశాలలు ప్రార్థనా గీతాలతో సందడిగా మారనున్నాయి. అయితే, ఎప్పటిలాగే స్కూళ్లలో సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయి. పాఠశాల విద్యారంగంలో అనేక మార్పులను చేపడుతున్నా మౌళిక సదుపాయాల కల్పనలో లోటు కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులతో అందంగా తీర్చిదిద్దుతున్నామని, నాణ్యమైన విద్యావిధానం అందచేస్తామని ప్రకటనలు చేస్తున్నా బడులు తెరిచే నాటికి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గడిచిన విద్యా సంవత్సరంలో అక్కడక్కడ అరకొర పనులు మినహా పూర్తిస్థాయి పనులేమీ జరగకపోడంతో అసంపూర్తి భవనాలే దర్శమిస్తున్నాయి.

- వివరాలు 8లో..

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గురువారం జరగనున్నాయి. జడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి ఏడు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమాలకు సంబంధించిన ఈ సమావేశాలు సాయంత్రం వరకు జరగనున్నాయి. స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారు లు హాజరుకావాలని జడ్పీ పరిపాలనాధికారి కొండయ్య ఒక ప్రకటనలో కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.9291
వెండి కిలో ధర రూ. 108400
వెండి ఒక గ్రాము రూ.111.40

ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ అధికారులు, ఈగల్ సెల్, ఆర్టీసీ పోలీసులు బుధవారం ఎన్‌డీపీఎస్ చట్టాలపై ఆర్టీసీ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ మాట్లా డుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బస్సుల్లో వాటిని తరలించ డం నేరమన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సమాచారం అందితే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని కోరారు.

మైపాడు నుంచి బస్సు నడపండి

డయల్ యువర్ డీఎంలో ప్రయాణికుడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మైపాడు నుంచి ఉదయం 3 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మైపాడు ప్రాంతానికి చెందిన వరప్రసాద్ అనే ప్రయాణికుడు ఆర్టీసీ అధికా రులను కోరారు. నెల్లూరు రెండవ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ పాల్గొ న్నారు. ఫోన్ ద్వారా ప్రయాణికుల ఫిర్యా దులు, సలహాలు, సూచనలు స్వీకరించారు. మైపాడు నుంచి ఉదయం సర్వీసు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంకటాచలం సమీపం లోని అడవిలో శివాలయం వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని బుజ బుజ నెల్లూరుకు చెందిన కేఎం శేఖరయ్య కోరారు. అందుకు స్పందించని డీఎం మాట్లాడు తూ ఆ రూట్‌లో నెల్లూరు-1, గూడూరు డిపోలకు చెందిన పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయని, ఆయా డిపో మేనేజర్లతో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీ నుంచి బుజ బుజ నెల్లూరు వరకు బస్సు నడపాలని ఆనంద్ అనే ప్రయాణికుడు కోరగా వెంకటేశ్వరపురం అండర్ బ్రిడ్జీ వద్ద ఆర్టీసీ బస్సులు టర్న్ అవడం వీలు కావడం లేదని, చిన్న బస్సులు వస్తే నడుపుతామని సమాధానమిచ్చారు.

నేడు ఒకటవ డిపోలో....

ఆర్టీసీ నెల్లూరు ఒకటవ డిపో పరిధి లోని ప్రయాణికులు, ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ డిపో మేనేజర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు 9959225641 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలుపొచ్చన్నారు.

నేడు బాల కార్మిక వ్యతిరేక ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ జరగనుంది. ఈ ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు జరుగుతుందని, ప్రజలందరూ తరలిరావాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ ఓ ప్రకటనలో కోరింది.

జీజీహెచ్‌లో సూపర్‌స్పెషలిటీ వైద్య సేవలు అందించాలి

● సీపీఎం నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం శ్రేణులు బుధవారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేశాయి. పార్టీ జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ నియోజక వర్గ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి పేదలు వైద్యం కోసం జీజీహెచ్‌కు వస్తుంటా రన్నారు. అయితే అత్యవసర సమయాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందక అనేక మంది రోగులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డయాగ్నోస్టిక్ సేవలు కూడా పూర్తి స్థాయిలో అందు బాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఆసుపత్రి స్థాయిని 750 పడకల నుంచి 900 పడకలకు పెంచినా తగినంత మంది స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్ట్‌లు లేరన్నారు. ఉన్న వైద్యులు కూడా కొందరు అందుబాటులో లేకపోవటం సరికాదన్నారు. ప్రత్యేకించి న్యూరో విభాగంలో వారం మొత్తం వైద్యులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచల నర్సయ్య, అబ్దుల్ అజీజ్, నజీర్, సురేష్. సుధాకర్, ఖలీల్, షాహినాబేగం, శంషాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య దేశం కోసమే యోగా

● ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి



యోగాసనాలు వేస్తున్న వైద్య విద్యార్థులు

నెల్లూరు (వైద్యం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన దేశం కోసం ప్రతీ ఒక్కరు యోగాసనాలు వేయాలని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. బుధవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో యోగా కార్యక్రమం జరిగింది. వైద్యులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం యోగాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒక భూమి.. ఒకటే ఆరోగ్యం అన్న నినాదంతో ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందని చెప్పారు. ఆరోగ్య జీవితానికి యోగా మంచి సాధనమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ, నెల్లూరు సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఏపీ టూరిజం అధికారి ఉషశ్రీ, ఎన్‌ఐసీ జిల్లా అధికారి సురేష్‌బాబు, ఎల్‌డీఎం మణిశేఖర్, జిల్లా యూత్ అధికారి మహేంద్రరెడ్డి, పతంజలి కేంద్రం ఇన్‌చార్జి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ కార్యాలయం

ఏడీఏగా సుజాత

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) కార్యాలయం ఏడీఏగా డీ సుజాత నియమితులయ్యారు. వ్యవసాయశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా కోవూరు ఏడీఏగా పనిచేస్తున్న సుజాత నెల్లూరుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఏడీఏగా పనిచేస్తున్న జీ అనిత బదిలీ అయ్యారు. అనిత గతంలో నెల్లూరు డీఏవో కార్యాలయంలో పనిచేశారు. ఆత్మకూరు ఏడీఏగా పనిచేస్తున్న వీ దేవసేనమ్మ, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ నెల్లూరు డిస్ట్రిక్ రీసోర్స్ సెంటర్(డీఆర్సీ)కి బదిలీ అయ్యారు. నెల్లూరు డీఆర్సీలో ఏడీఏగా పనిచేస్తున్న వీ సుమలత ఇందుకూరుపేట ఏడీఏగా, డీఏవో కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న ఎం శేషగిరి వింజమూరు ఏడీఏగా బదిలీ అయ్యారు. డీఆర్సీలో ఏడీఏగా పనిచేస్తున్న జీ లక్ష్మీమాధవి కడపకు బదిలీ అయ్యారు. జిల్లాలో వ్యవసాయ అధికారులు కూడా బదిలీ అయినప్పటికీ ప్రస్తుతం వాటిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది.

50 వసంతాల అవోపా

● స్వర్ణోత్సవం పడిలోకి సేవా సంస్థ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవే పరమావధిగా పురుడుపోసుకున్న ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. 1976 జూన్ 12వ తేదీన ఏర్పడిన ఆ సంఘం 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని గోల్డెన్‌జూబ్లీలోకి ప్రవేశించింది. ఆ సంఘం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారు. ఎన్నో ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికలు నిర్వహించింది. విద్యార్థులకు ప్రోత్సాహకాలు, విపత్తుల సమయంలో ఆపన్నులకు సహాయం అందించింది. 50వ పడిలోకి అడుగుడితున్న అవోపాకు ప్రజాసైన్స్ వేదిక నెల్లూరు శాఖ అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్‌తోపాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

● ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి



విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పక్కన ఎంపీ వేమిరెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 11(ఆంధ్ర జ్యోతి): చదువుతోనే మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడం సాధ్యపడుతుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధ వారం నగరంలోని డీజీపీ కల్యాణ మండపంలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎంపీ మాట్లాడుతూ చదువు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమైందన్నారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని, మరో పది మందికి సాయం చేసేలా తయార వ్వాలని ఆకాంక్షించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు బుధవరపు బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, రూరల్ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పద్మశాలి కార్పొరే షన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, వీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత చేవూరి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సోమగోపాల్ పాల్గొన్నారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): చెయ్యి భాగం పూర్తిగా నీలి రంగులోకి మారి తీవ్రమైన నొప్పితో రుయాస్పత్రికి వచ్చిన వ్యక్తికి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి నయం చేశారు. సూపరింటెండెంట్ రాధ తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన శ్రీనివాసులు(37) ఎడమ చేయి భాగం పూర్తిగా నీలిరంగులోకి మారిపోయింది. తీవ్రమైన నొప్పితో రుయాస్పత్రికి వచ్చాడు. సీటీ సర్జరీ విభాగం వైద్యులు కళ్యాణి రమ, సనా రోహితలు పరీక్షించగా రక్తం పూర్తిగా గడ్డకట్టి సరఫరా కాకపోవడాన్ని గుర్తించారు. అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. రక్తనాళాలను సరిచేయడమేగాక రక్తం పలుచబడే మందులు ఇవ్వడంతో నొప్పి తగ్గడమేగాక చేయి సాధారణ రంగుకు వచ్చింది. పూర్తిగా కోలుకున్న రోగిని బుధవారం డిశ్చార్జి చేశారు. అనుభవం కలిగిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండటం వల్ల అరుదైన చికిత్సను విజయవంతం చేయగలుగుతున్నామని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ డాక్టర్లు పద్మ, జ్ఞాపిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సమైక్యంగా నిలవాలి



మతసామరస్య ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

నెల్లూరు (వైద్యం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కుల, మతాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ సమైక్యంగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ నుంచి ఆర్టీసీ కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తున్నామన్నారు. దేశంలో మతపరమైన విభజన తీసుకు రావాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టాలని ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. అయితే దేశ ప్రజలందరూ సమైక్యంగా నిలబడి మతాలకు అతీతంగా ఉగ్రమూకల పథకాన్ని వమ్ము చేశారని కొనియా డారు. పాకిస్థాన్‌పై దాడులు, యుద్ధంపై వాస్తవాలను పార్లమెంటులో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు పెంచల నర్సయ్య, అబ్దుల్ అజీజ్, కట్టా సతీష్, ఒంగోలు సుధీర్, షాహినా బేగం, అరిగెల రమమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఉండాలి : కమిషనర్



నెల్లూరు(సిటీ), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో ప్రతీ దుకాణదారుడు విధిగా చెత్తబుట్టను పెట్టుకోవాలని కమిషనర్ నందన్ వ్యాపారులకు సూచించారు. బుధవారం మార్కెట్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. వ్యాపారులు చెత్తను ఎక్కడంటే అక్కడ వేయకుండా బుట్టల్లోనే వేయాలని, ప్రతీ నిత్యం మార్కెట్ నుంచి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. మార్కెట్లోకి పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నగరం లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య విభాగంతో సమీక్ష జరిపారు. యోగాంధ్ర పోటీలపై సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రెండు రోజుల్లో పుస్తకాల పంపిణీ

ఎంఈవో-1 వసంతకుమారి, కొడవలూరు

కొడవలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎంఈవో-1 వసంతకుమారి తెలిపారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయని రెండు రోజుల్లో అందరికీ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

? : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి.

! : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

? : పాఠశాల పునః ప్రారంభానికి ఎలాంటి చర్యలు చేపట్టారు.

! : గురువారం నుంచి మండలంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలలు తెరుచుంటాయి.

? : మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎలా అమలు చేయనున్నారు.

! : మధ్యాహ్న భోజన పథకం సంబంధించి అన్నీ పాఠశాలలకు సన్నబియ్యం అందాయి. సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం పెట్టనున్నాం.

? : విద్యార్థులకు పుస్తకాలు ఎప్పుడు పంపిణీ చేస్తారు.

! : విద్యార్థులకు పుస్తకాలు వచ్చాయి. అందరికీ రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తాం.

సామూహిక లక్ష మల్లెల అర్చన

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా బాలాజీనగ ర్ సీతారామ మందిరంలో సీతారామచంద్ర స్వా మి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వ ర స్వామికి బుధవారం విశేష అభిషేకం, శాంతి హోమం జరిగాయి. భక్తులతో సామూహికంగా లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ఆలయ పాలక మండలి పర్యవేక్షించింది.

అవినీతి పాలనకు చరమగీతం పాడి ఏడాది : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరులో జల్‌జీవన్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడి, ఏడాది పూర్తవుతోందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆమె జల్‌జీవన్ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అవినీతి రహిత కోవూరు నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు సేవచేసేవారే నాయకులని చెప్పారు. నాయకులపై అసభ్యంగా మాట్లాడకూడదన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎక్కడ అవినీతి జరిగిందో తాను రుజువుచేస్తానన్నారు.ఇరిగేషన్, ఇసుక, మట్టి, గ్రావెల్ వ్యవహారాల్లో అవినీతికి పాల్పడిన విషయాన్ని తాము రుజువు చేస్తామన్నారు. వైసీపీతో విసిగిపోయిన ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. తమపై నమ్మకంతో నేతలు పార్టీలో చేరుతున్నారని వివరించారు. అనంతరం ఆమె ఇనమడుగు రోడ్డులో కోవూరు-ఊటుకూరు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టీ పార్వతి, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, కోవూరు, వేగూరు సర్పంచులు యాకసిరి విజయ, అమరావతి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, కొలారెడ్డి సుధాకర్‌రెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

● **గ్రామీణాభివృద్ధికి పెద్దపీట**

విడవలూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చౌకిచర్లలో బుధవారం జరిగిన ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేని ఎండ్లబండిపై ఊరేగించారు. అనంతరం రూ.1.20కోట్లతో నిర్మించనున్న విడవలూరు-వావిళ్ల, అన్నారెడ్డిపాళెం-వరిణి రోడ్లకి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, ఏటూరు హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **పేదల అభివృద్ధే లక్ష్యం**

కొడవలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పేదల ఆర్థిక అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో పెయ్యాలపాలెంలో రూ.5లక్షల సిమెంటు రోడ్డు, రూ.కోటి వ్యయంతో తారురోడ్డుకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ పట్టిందన్నారు. ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నదని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీఎన్.శేఖర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, పీ.ప్రసాద్ రెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జొన్న శివకుమార్, కేతూ వెంకటరమణారెడ్డి, చెక్క మదన్ తదితరులు పాల్గొన్నారు.

● **అభివృద్ధికి పల్లెపండుగే నిదర్శనం**

బుచ్చిరెడ్డిపాళెం,జూన్ 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి పల్లె పండుగే నిదర్శనమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెనుబల్లిలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రారంబోత్సవం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోడ్లు, డ్రైన్లు, శ్మశానాలు, తాగునీటి అవసరాలకు ఒక్క బుచ్చి మండలంలో రూ.4.70కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. కోవూరు నియోజకవర్గంలో రూ.28కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జగదీష్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, సర్పంచు ఊడా పెంచలయ్య, ఎంపీటీసీ సీహెచ్.నారాయణ, నాయకులు మహేంద్ర, సురేంద్ర, గోపి, బీజేపీ నేత శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

మనుబోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ.రంగా, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని వరి పరిశోధర సంస్థకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే. నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్థాయి ఆగ్రో జియో ఇన్ ఫర్ మేటిక్ వ్యవస్థ తాలూకా అవస రం గురించి ప్రస్తావిస్తూ అలాంటి వ్యవస్థను ఎలా తయారు చేయ వచ్చేనో వివరించారు. అలాగే మీ మట్టిని మీరే కాపాడుకోండి అనే నినాదాన్ని ముందుకు తెస్తూ, గ్రా మస్థాయిలో డిజిటల్ సాయిల్ మ్యాప్స్ ఎలా తయారు చేయగల మో వివరించారు. మరో ఇద్దరు శాస్త్రవేత్తలు డాక్టర్ పీ మధుసూ దన్, హరిసాదులు మెలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో వీఏఏ తేజస్వి పాల్గొన్నారు.

● **వెంకటాచలం** : మండలంలోని గొలగమూడిలో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కా ర్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతు లకు భూసార పరీక్షలు, మట్టి నమునాలు సేకరణ గురించి అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు లోకేష్, లక్ష్మీప్రసన్న, వ్యవసాయ అధి కారి హరి కరుణాకర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది, పలువురు కూటమి నేతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే నాగేశ్వరరావు

గ్రామసమస్యలపై ఆరా

పొదలకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మవారిపాలెంలో బుధవారం సర్వేపల్లి నియోజకవర్గ సమ న్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి దంపతులు పర్యటించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వ హించి సమస్యలపై ఆరా తీశారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అద్దంకి గిరినాయుడు, కొమ్మి రమేష్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, సురేష్‌నాయుడు, సీతారామయ్య, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

రూ. 36లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణం



వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నేతలు

విడవలూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లిలో సుమారు రూ.36లక్షలతో వాటర్ ట్యాంకును నిర్మిస్తున్నట్లు సర్పంచు రామిశెట్టి స్వాతి, మండల టీడీపీ ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థానిక జడ్పీ హైస్కూల్ సమీపంలో బుధవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యకు ట్యాంకు నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, ఆవుల వాసు, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, వేగూరు చంద్రారెడ్డి, పూండ్ల ఏసోబు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ





బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, బాధ్యతలు చేపట్టిన ఏడీఏ అనిత

కోవూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బదలీల ప్రక్రియలో తహసీల్దారుగా నియమితులైన సీహెచ్ సుబ్బయ్య బుధవారం తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఏడాది కిందట ఆయన ఇక్కడ తహసీల్దారుగా పనిచేసి టీపీ గూడూరుకు బదిలీ అయ్యారు. ఆయనకు మండల పరిధిలోని సమస్యలన్నీ తెలియడంతో పరిష్కారమయ్యే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. కాగా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులుగా అనిత కూడా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె వ్యవసాయాధికారిగా పనిచేయడంతో రైతుల సమస్యలు, పంటలసాగుపై అపారమైన అనుభవముందని రైతులు చెబుతున్నారు.

పుస్తకాలు సరే... సమదుస్తులేవీ ?

మనుబోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలలకు ప్రతి విద్యార్థికి కిట్ అందిస్తామని ప్రభుత్వం చెపుతూ వస్తోంది. అయితే బుధవారం నాటికి మండలంలోని 3వేల మందికిపైగా ఉన్న పిల్లలకు కేవలం పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలు, బెల్టులు మాత్రమే వచ్చాయి. వాటిని మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది ఆయా పాఠశాలలకు చేర్చారు. అయితే ఇంకా కిట్‌లో రావాల్సిన సమదుస్తులు (యూనిఫామ్), పాదరక్షలు(బూట్లు), సాక్సులు రానేలేదు. పాఠశాలల పునః ప్రారంభం వేళ పిల్లలకు అవరసమైనవి సమదుస్తులు. అవి ఇంకా రాకపోవడంపై పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

కోనలో ఘనంగా జేష్ఠ పౌర్ణమి పూజలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో జేష్ఠ పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవార్లను తిరుచ్చిపై ఆశీనులను చేసి ఆస్థాన సేవ నిర్వహించారు. స్వామి వారికి 81 కలశాలతో జేష్టాభిషేకం నిర్వహించారు. ఉదయం శ్రీవార్లకు స్నపన తిరుమంజనం, హోమాలు సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులంతా సంతోషంగా ఉండా లంటూ పూజలు నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



స్వామి వారికి సిద్ధం చేసిన 81 కలశాలు

కార్మిక శాఖలో 16 మంది బదిలీ

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా కార్మిక శాఖలో 16 మంది బదిలీ అయ్యారు. నెల్లూరులో సహాయ కార్మికశాఖ అధికారిగా పనిచేస్తున్న రామకృష్ణ ఒంగోలుకు బదిలీ అయ్యారు. గూడూరు సహాయ కార్మిక అధికారిగా పనిచేస్తున్న వై సత్యనారాయణ నెల్లూరుకు వచ్చారు. సీనియర్ సహాయకుల్లో డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న జీ శ్రీకాంత్ గూడూరు ఏసీఎల్ కార్యాల యానికి, అక్కడ పని చేస్తున్న కే శ్రీనివాసులురెడ్డి నెల్లూరు డీసీఎల్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. గూడూరులో పని చేస్తున్న పీ అనూజ నెల్లూరు డీసీఎల్ కార్యాలయానికి, నెల్లూరు ఏపీఎల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏ బాబుల్‌రెడ్డి నాయుడుపేటకు బదిలీ అయ్యారు. జూనియర్ సహాయకుల్లో ఎన్ వినోద్‌కుమార్ నెల్లూరు నుంచి ఆత్మకూరుకు, సేడి గుఫ్రాన్ ఆత్మకూరు నుంచి నెల్లూరుకు, టీ కార్తీక్ ఉదయగిరి నుంచి గూడూరుకు, డీ భరత్‌రాజ్ రాపూరు నుంచి నెల్లూరుకు, స్వర్ణలత గూడూరు నుంచి రాపూరుకు బదిలీ అయ్యారు. ఆఫీసు సబార్డినేట్స్‌లో ఎస్‌కే గౌస్‌బాషా గూడూరు నుంచి ఉదయగిరికి, సంపూర్ణ ఆత్మకూరు నుంచి గూడూరుకు, విమలమ్మ నెల్లూరు నుంచి ఆత్మకూరుకు బదిలీ అయ్యారు.

పౌరసంబంధాలశాఖ డీడీ బదిలీ: నెల్లూరు డీపీఆర్వోగా రవికుమార్

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : పౌర సంబంధాల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కే సదారావును ప్రభుత్వం విశాఖపట్నంకు డీడీ ఐపీఆర్‌గా బదిలీ చేసింది. నెల్లూరుకు డీడీగా ఎవరినీ నియమించ లేదు. సదారావు జిల్లాలో రెండేళ్లు విధులు నిర్వహించారు. కాగా, నెల్లూరు డివిజనల్ పీఆర్వోగా రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి



పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బుధవారం డీసీపల్లిలో ఏరువాక పౌర్ణమి జరిగింది. వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్, టీడీపీ నేత ఆరికట్ల జనార్దన్ నాయుడు పూజలు చేసి, కాడెద్దులతో అరక దున్ని, నవధాన్యాలు విత్తారు. ఈ కార్యక్రమంలో బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కాగా, డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 819 బేళ్లను తీసుకురాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 548 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 271 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180 పలికినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

ఆటలకు టాటా... ఇక బడి బాట!

నెల్లూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలు 2,595, ఎయిడెడ్ 22, ప్రైవేట్ 814 మొత్తం 3,431 పాఠశాలలు ఉండగా, 3,54,779 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలల పునరుద్ధరణ జరిగిన నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకుపాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించామని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ప్రధానంగా మంచినీటి ఇబ్బందులు విద్యార్థులను వెంటాడనుంది. రూ.కోట్లు వెచ్చించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలిపోతున్నాయి. ఆగమేఘాలపై నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం అందుకు తగినట్లు పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించడంలో దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాలకు ప్రభుత్వ బడుల లెక్క తేల్చి పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఖాళీల పోస్టుల భర్తీపై చేపట్టిన పరిశీలన పూర్తవడంతో జిల్లాలో అన్ని రకాలు కలిపి 3221 పాఠశాలలు ఉంటాయని అధికారులు తేల్చి చెప్పారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలకు శాటిలైట్ స్కూల్స్‌గా నామకరణం చేసినా జిల్లాలో ఒక్కటి కూడా లేకుండా మూసివేశారు. అలాగే పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో జిల్లాలో శాటిలైట్ స్కూల్స్ 0, ఫౌండేషన్ స్కూల్స్-968, బేసిక్ ప్రైమరీ స్కూల్స్-1187, మోడల్ ప్రైమరీ స్కూల్స్-594, అప్పర్ ప్రైమరీ స్కూల్స్-79, హైస్కూల్స్-28, హైస్కూల్స్ + బీపీఎస్ -74, హైస్కూల్స్ + ఎంపీఎస్ -31 స్కూల్స్ నామకరణంతో ఇకపై నడుస్తాయని ప్రకటించారు. మన బడి-మనభవిష్యత్ కింద పాఠశాలల్లో వసతులు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అత్యధిక పాఠశాలల్లో నేటివరకు పునాదులే పడకపోవడం విశేషం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ, వంటశాలలు, తాగునీరు, విద్యుత్, బెంచీలు, గ్రీన్‌బోర్డుల ఏర్పాటు తదితర వసతులు కల్పించాలని ఆదేశించినా నేటికీ ఈ పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి.

పునః ప్రారంభం షెడ్యూల్

పాఠశాలల పునః ప్రారంభానికి సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆదేశాలిచ్చారు. 11వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పర్యటించడం, ఇంటింటా ప్రచారం, బడి మానేసిన పిల్లల్ని గుర్తించి బడుల్లో చేర్పించాలి. 12న పునః ప్రారంభం రోజున పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేయాలి. 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ నిర్వహించాలి. 16న ఎల్‌ఐపీ కార్యక్రమం, 17న విలీన విద్య, బాలికా విద్యా దినోత్సవం నిర్వహించాలి. 18న డిజిటలీకరణ, మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. 19న వివిధ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలి.



మనుబోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- నేడే పాఠశాలల పునఃప్రారంభం
- 49 రోజుల తర్వాత తెరుచుకోనున్న తలుపులు
- ఇక్కట్లతోనే విద్యాసంవత్సరానికి స్వాగతం

● తొలిరోజే విద్యార్థి మిత్ర కిట్లు

పాఠశాల ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఏకరూప దుస్తులతోపాటు విద్యా సామగ్రి అంతా అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేక పర్యవేక్షణలో అన్ని తరగతులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో విద్యాసామగ్రి పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు. 1,61,959 స్కూలు బ్యాగులు, 1,15,548 బెల్టులు, 1,61,959 యూనిఫామ్‌లు, 1,64,721 షూలు, 3,29,442 సాక్సులు, 8,74,740 నోటుపుస్తకాలు, 13,375 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 18,743 పిక్టోరియల్ డిక్షనరీలు, 7,71,185 టెక్స్ట్ బుక్స్ జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా, మండల కమిటీలతోపాటు పాఠశాల కమిటీల ద్వారా విద్యార్థులకు అందజేయనున్నారు.

● కొనసాగుతున్న టీచర్ల బదిలీలు

ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియ ఇంకా కొనసాగుతుండటంతో పాఠశాలల పునఃప్రారంభ షెడ్యూల్, స్వాగత ఏర్పాట్లు జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు. మరో వారం రోజులపాటు బదిలీల ప్రక్రియ ఉంటుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు చెప్పడంతో ఈ ఏడాది పాఠశాలల ప్రారంభోత్సవాలు నామమాత్రంగానే జరగనున్నాయి. పూర్తిస్థాయిలో జరిగి ఉపాధ్యాయులంతా విధుల్లో చేరిన తరువాతనే పాఠశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అప్పటివరకు పాఠశాలల ఆలనా, పాలనా అంతా విద్యాశాఖ అధికారులు, నాన్‌టీచింగ్ సిబ్బందే పర్యవేక్షించాల్సి ఉంటుంది.



సాంకేతిక శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఆహార శుద్ధి రంగంలో అపార అవకాశాలు

● సాంకేతిక శిక్షణలో ఈడీ శ్రీనివాసులు

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : ఆహార శుద్ధి పరిశ్రమలో ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం డీఆర్‌డీఏ, మెప్మా క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఆహారశుద్ధి కార్యకలాపాలపై సాంకేతిక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెడీ టూ ఈట్, రెడీ టూ కుక్ విధానంలో ఆహార ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతున్న దృష్ట్యా, ఆహార శుద్ధి రంగంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల సామర్థ్యాన్ని పెంచటం, మౌలిక సదుపా యాలు, ప్యాకేజింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ విభాగాల్లో స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించటం జరుగుతుందని చెప్పారు. ఈ పథకం కింద వ్యాపారవృద్ధి కోసం 30 శాతం సబ్సిడీతో ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. గ్రూపులుగా ఏర్పడిన ఉత్పత్తిదారులు, స్వయం సహాయక సంఘాలకు మౌలిక వసతులు కల్పించటం, వాటికి బ్రాండింగ్, మార్కెటింగ్ మద్దతు కల్పించటం జరుగుతుందని వివరించారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ల మూత

● సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కోసం అంతరాయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ ఆర్టీసీ బస్టాండ్లలో ఉండే బస్‌పాస్ కౌంటర్లు గురువారం నుంచి రెండు రోజులు మూతపడుతున్నాయి. బస్‌పాస్‌లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తుండటంతో సాంకేతిక కారణాలతో రెండు రోజులు కౌంటర్లను అధికారులు మూసివేస్తున్నారు. ఈ నెల 14వ తేదీ ఉదయం నుంచి నూతన సాఫ్ట్ వేర్‌తో కౌంటర్లు పునఃప్రారంభంకానున్నాయి. కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఐడీ కార్డులు బులుగు రంగులో, టికెట్లు నారింజ రంగులో రానున్నాయి.



బస్‌పాస్‌ల కౌంటర్ వద్ద ప్రజలకు తెలియజేస్తూ ప్రకటన

వైద్యం కోసం వెళ్లిన బాలిక పట్ల వైద్యుడి అసభ్యకర ప్రవర్తన

● పోలీసులకు ఫిర్యాదు ● డాక్టర్‌పై తల్లిదండ్రుల దాడి యత్నం ● సర్దిచెప్పిన పోలీసులు

ఉదయగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వెళ్లిన బాలికపై వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఓ మహిళ తన 12 ఏళ్ల కుమార్తెకు చెవినొప్పిగా ఉండడంతో వైద్యశాలకు తీసుకెళ్లింది. అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ ప్రశాంత్ దగ్గరకు బాలికను తీసుకెళ్లింది. ఆయన బాలికను పరీక్షిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ కుటుంబ సభ్యులకు, బంధువులకు బాలిక తెలిపింది. దీంతో తల్లి వైద్యుడిని నిలదీసింది. ఈలోపు మహిళ బంధువులు, కుటుంబ సభ్యులు వైద్యశాలకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఒకానొక దశలో వైద్యుడిపై బాలిక తల్లిదండ్రులు, బంధువులు దాడికి యత్నించడంతో పాటు దుర్భాషలాడారు. అక్కడే ఉన్న పోలీసులు వారికి చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. పోలీసులు వైద్యుడిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వైద్యశాలలో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించడంతో పాటు ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.



వైద్యుడిపై దాడి చేసేందుకు యత్నిస్తున్న కుటుంబ సభ్యులకు సర్దిచెబుతున్న పోలీసులు

మహిళపై దూషణ, దౌర్జన్యం: ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): మహిళను కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేసిన ఘటనలో నిందితులపై చిన్నబజారు పోలీసులు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని విరాట్ నగర్‌లో విజయ కుటుంబం నివశిస్తోంది. ఆమెకు తల్లిదండ్రులు పసుపు కుంకుమ కింద వీబీఎస్ కల్యాణ మండపం సమీపంలో ఓ స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలంలో ఉన్న పాత ఇంటిని కూలగొట్టి కొత్త గృహాన్ని నిర్మించుకునేందుకు ఆమె ప్రయత్నిస్తోంది. ఆ ఇంటి పక్కనే ఉంటున్న జిలానీ, మరి కొందరు గత నెల 23న సదరు స్థలంలో గోడ కట్టేందుకు యత్నిస్తుండగా విజయ అడ్డుకుంది. దీంతో వారు ఆమెను కులం పేరుతో దూషించడమే కాకుండా దౌర్జన్యం చేశారు. బాధితురాలు బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు.

లోను ఇప్పిస్తామని నగదు దోచేశారు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): లోను ఇప్పిస్తామని ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాల నుంచి నగదు దోచేయడంతోపాటు అంతుచూస్తామని బెదిరించిన నిందితునిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లాలోని సీతారామపురం మండలానికి చెందిన కే రాజుకు పొదలకూరు పద్మావతినగర్‌కు చెందిన శివ కృష్ణారెడ్డి పరిచయం అయ్యారు. ఆయన బ్యాంకులో లోను ఇప్పిస్తానని రాజును నమ్మించాడు. అతనికి తెలియకుండానే అతని బ్యాంకు ఖాతాల నుంచి రూ. 5 లక్షలు, రూ.4.20 లక్షలు కలిపి మొత్తం రూ. 9.20 లక్షలను శివకృష్ణారెడ్డి డ్రా చేశారు. ఇదేమని ప్రశ్నించిన రాజును అంతు చూస్తామని బెదిరించాడు. బాధితుడు బుధవారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి

తోటపల్లిగూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న చెరుకూరు రోడ్డులో బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు, ఇందుకూరుపేటకు చెందిన వెంపులూరు సతీష్‌గౌడ్ (30) మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో మండలం లోని కాకుపల్లి నుంచి నరుకూరుకు వెళుతుండగా మార్గం మధ్యలో కాలువ తూములు వద్ద డివైడర్‌ను ఢీకొని కాలువలో పడిపోయాడు. బుధవారం ఉదయం గమనించిన చుట్టుపక్కల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామా కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరేంద్రబాబు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన సతీష్

ఏఎంసీ కార్యాలయంలో చోరీ

ఉదయగిరి, జూన్ 11 ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కార్యాలయ వెంటిలేటర్ కిటికీని ధ్వంసం చేసి కార్యాలయంలోకి ప్రవేశించి అక్కడున్న రెండు కంప్యూటర్లు, సామగ్రి చోరీచేశారు. బుధవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది చోరీ జరిగిందని గుర్తించి అధికారులకు తెలిపారు. దీంతో సూపర్‌వైజర్ ఎడ్విన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

యువకుల ప్రాణాలు కాపాడిన మెరైన్ పోలీసులు

తోటపల్లిగూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు బీచ్ వద్ద బుధవారం సముద్రంలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగి పోయిన ఇద్దరి యువకులను మెరైన్ పోలీసులను కాపాడారు. ఎస్ఐ అంజిరెడ్డి సమాచారం మేరకు వివరాలు... తోటపల్లిగూ డూరు మండలం కోడూరు బీచ్‌కు బుధవారం కోవూరు మండలం లేకుంటపాడుకు చెందిన గున్నం ఉదయ్‌కిరణ్, కరేటి వినయ్‌కుమార్ బీచ్‌లో సముద్ర స్నానం కోసం దిగడంతో అలల ధాటికి మునిగిపోయారు. గమనించిన మెరైన్ సిబ్బంది కమలాకర్, శ్రీనివాసులు వెంటనే స్పందించి ఇరువురిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. దీంతో స్థానికులు వారిని ప్రశంసించారు.



సముద్రపు అలల నుంచి యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు



ప్రిన్సిపాళ్ల సమావేశంలో కోఆర్డినేటర్ ప్రభావతమ్మ

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయండి

అంబేడ్కర్ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల్లో విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల కోఆర్డినేటర్ డాక్టర్ సీ ప్రభావతమ్మ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కోఆర్డి నేటర్‌గా బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరంలో జిల్లాలో అంబేడ్కర్ గురుకులాల్లోని విద్యార్థులు మంచి మార్కులు సాధించి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావడం ఆనందదాయకమన్నారు. నూతన విద్యా సంవత్సరంలో గురుకులాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, వారికి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

నెల్లూరు ఆర్టీవోగా మదనీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రోడ్డు రవాణా అధికారి (ఆర్టీవో)గా ఎండీ మదనీ బుధవారం నగరంలోని డీటీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీటీసీ చందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మదనీకి ఎంవీఐలు, ఏఎంవీఐలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మ తిట్టిందని ఉరేసుకున్న వివాహిత

నెల్లూరురూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తన తల్లి తిట్టిందని మనస్తాపానికి గురైన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.. నెల్లూరులోని కల్లూరుపల్లి ఆర్‌డీడీ కాలనీలో నివాసముంటున్న రజియా (23)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఐదేళ్ల బాబు ఉన్నాడు. భర్తతో తలెత్తిన వివాదం కారణంగా అమ్మగారింట్లోనే ఉంటోంది. కాగా, ఇంట్లో పని చేయడంలేదని, నీళ్ల పట్టడంలేదని తల్లి తిట్టడంతో క్షణికావేశానికి గురైన రజియా ఇంట్లోనే ఉరేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పొదలకూరు పూర్వ కార్యదర్శి సస్పెన్షన్

పొదలకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదలకూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి, ప్రస్తుతం డక్కిలి డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న షేక్.అల్లాబక్షును ఆ శాఖ ఉన్నతాధి కారులు బుధవారం సస్పెండ్ చేస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. పొదలకూరు పంచాయ తీలో అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇచ్చా రని, అనధికార లేఅవుట్లలో అక్రమంగా ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చారని ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇతనిపై గతంలో టీడీపీ నాయకులు పలు ఆరోపణలు చేశారు.

పోలీసుల అదుపులో ధాన్యం దళారి ?

● రూ.76 లక్షలు రావాలంటున్న రైతులు

మనుబోలు,జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులను నమ్మించి, నట్టేట ముంచేసిన ధాన్యం దళారి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. రూ. లక్షలు నష్టపోయామంటూ మండల రైతులు లబోదిబోమంటున్నారు.రైతులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చెర్లోపల్లి, జట్లకొండూరు, మడమనూరు గ్రామాలకు చెందిన రైతులు గతనెల 15న వెంకటాచలం మండలం పూడిపూర్తికి చెందిన దళారి రామారావుకు 300పుట్ల ధాన్యాన్ని అమ్మారు. వీటివిలువ సుమారు రూ.76లక్షలు. పది రోజుల్లోగా డబ్బులు ఇస్తానని రామారావు చెప్పడంతో. గత కొన్నేళ్లుగా ఇదే వ్యాపారం చేస్తుండడంతో నమ్మబలికి ఇచ్చారు. కమీషన్‌కు ఆశపడి తీసుకెళ్లిన ధాన్యాన్ని తన స్నేహితుడు కాకార్లపాళెంకు చెందిన పెంచలయ్యకు రామారావు తోలాడు. పెంచలయ్య ధాన్యం తనే అమ్మి డబ్బులి స్తానని చెప్పి 300 పుట్ల ధాన్యాన్ని ఎర్రగుంట ప్రాంతానికి చెందిన శీనయ్యకు ఇచ్చాడు. రైతులు పలుమార్లు రామారావును డబ్బులు అడుగుతున్న ఎంతకీ ఇవ్వలేదు. దీంతో రెండు రోజుల క్రితం రైతులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు దళారి ముఠాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రధాన సూత్రధారి శీనయ్య గతంలో ఇదే తరహా వ్యాపారాలు చేసి వెంకటాచలంలో చాలామందికి ఐపీ పెట్టాడు. గతనెలలో వచ్చిన రైతుల డబ్బుతో క్రికెట్ బెట్టింగులు ఆడి పోగొట్టాడు. రెండురోజులుగా ధాన్యం డబ్బుల కోసం రైతులు పోలీస్‌స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అల్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన అల్లూరులో బుధవారం జరిగింది. స్థానిక వైఎస్సార్ విగ్రహం సమీపంలోని మటన్ మార్కెట్‌లో రక్తపు మడుగులో గంటా సురేష్(27) విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ కిషోర్‌బాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు అల్లూరు దళితవాడకు చెందిన గంటా వేమయ్య, రంగమ్మ దంపతుల కుమారుడు సురేష్ అలియాస్ డాన్‌గా గుర్తించారు. తల్లిదండ్రులు ఇరువురు మరణించడంతో ఆలనాపాలనా చూసేవారు లేక సెంట్రింగ్ పనులకు వెళ్తూ వచ్చిన నగదుతో జీవనం సాగిస్తుంటాడు. సురేష్ తరచూ రాత్రి సమయాల్లో మార్కెట్‌కు ఆనుకొని నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనంపైన నిద్రిస్తుంటారు. ఇదేవిధంగా మంగళవారం రాత్రి నిద్రించిన సురేష్ పక్కనే మార్కెట్‌లో రక్తపు మడుగులో పడి ఉండడం, తలపై తీవ్ర గాయం కావడం చూస్తుంటే భవనం పైనుంచి పడి మృతి చెంది ఉండవచ్చని కొందరు, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసి ఉండొచ్చని మరికొందరు భావిస్తున్నారు. మృతదేహానికి శవపంచమానా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి నాయనమ్మ మనవడి మృతిని చూసి తట్టుకోలేక గుండెలవిసేలా రోదించడం స్థానికులను కలచి వేసింది.



రక్తపు మడుగులో సురేష్ మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100) : 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9291
వెండి కిలో ధర	రూ. 108400
వెండి ఒక గ్రాము	రూ.111.40

యోగాతో మెరుగైన ఆరోగ్యం

కొండాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యోగాతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని భీమవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. యోగా కార్యక్రమంపై బుధవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామస్థులతో యోగాసనాలు వేయించి ప్రతి ఒక్కరూ తమ దైనందిన కార్యక్రమాలలో యోగాను ఒక భాగంగా రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు మధు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

కావలిరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురంలో రూ.90 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, రూ.60 లక్షలతో ఏర్పాటు చేసిన త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం సాయంత్రం ఆర్డీవో సన్నీ వంశీకృష్ణతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరపురం ఆనుకుని ఉన్న చిప్పలేరు పొంగినప్పుడు గ్రామంలో కొంతభాగం కోతకు గురవుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల పాపాలే గ్రామస్థుల పాలిట శాపాలై తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి, ఈఈలు వేణుగోపాల్, లోక్‌నాథ్, విద్యుత్ శాఖ డీఈ బెనర్జీ, ఏఈలు సుబ్రహ్మణ్యం, రహమాన్, శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె, చెప్పుల పంపిణీ

కావలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలక సంఘం ప్రజా ఆరోగ్య విభాగంలో అవుట్‌సోర్స్ కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సబ్బులు, నూనె, చెప్పులు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్, రెవెన్యూ ఆఫీసరు అలీమ్, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఫిరోజ్‌కు సత్కారం

కావలిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : గుండెపోటుకు గురై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్న దగ్గర ఇందిరమ్మ కాలనీ వాసి, హోటర్ కార్మికుడిని ఆ మార్గంలో వెళుతూ గుర్తించిన 1వ పట్టణ సీఐ ఫిరోజ్ సీపీఆర్ చికిత్స అందించి ప్రాణం పోశారు. దీంతో ఆయనను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల వేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఎస్ఐ జమాల్‌వలి, ప్రతినిధులు ప్రసాదరావు, దిలీప్, గనీ, అలీం, జమీర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

వలేటివారిపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దారుగా నయీం అహ్మద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సెలవులో ఉండగా ప్రభుత్వ వలేటివారిపాలెంకు నియమించింది. ప్రస్తుతం ఉన్న తహసీల్దారు శ్రీనివాసులు కొండపికి బదిలీ అయ్యారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని అజ్మల్ నర్సింగ్‌హోం, ప్రగతి నర్సింగ్‌హోం, న్యూ లైఫ్ ఆసుపత్రిలలో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు రజని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆమె వెంట సామాజిక ఆరోగ్య అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

తైక్వాండో విజేతలకు పురస్కారాలు

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన కందుకూరుకు చెందిన క్రీడాకారులకు శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బంగారు పతకాలు సాధించిన బి.లక్ష్మీఅక్షర, సి.లక్ష్మీప్రియ, ఏ.మన్విత్‌రాజ్, జి.త్రినాథ్‌లతో పాటు రజిత పతకాలు సాధించిన జి.ఉత్తంప్రేమ్‌సాత్విక్, పి.సాయిశ్రీవాత్సవ్, కాంశ్య పతకం సాధించిన సి. మోహిత్ కేసరినందన్‌లను వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులుతో పాటు క్రీడాకారులను తీర్చిదిద్దిన మాస్టర్ అబ్దుల్ సలాం, అఖిల్‌లను అభినందించారు. కార్యక్రమంలో చక్కా వెంకటకేశవరావు, జయవరపు కిషోర్, బీవీఎస్ ప్రసాద్, బీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో అధిక లాభాలు

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నూతన సాంకేతికతను ఉపయోగించుకుంటేనే లాభాలు దక్కుతాయని కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రం అధికారి రాజగోపాలరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోవూరులో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీఏఆర్, కేవీకే ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 1.5 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, గ్రామాలకు శాస్త్రవేత్తలు వెళ్లి సాంకేతికత వల్ల ప్రయోజనాలు, పెట్టుబడి వ్యయం తగ్గించుకునే మార్గాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ శాస్త్రవేత్త గంగాధర్, పౌల్ట్రీ శాస్త్రవేత్త రాజారవీంద్ర, పాల్గొన్నారు.

పేదలకు కళ్లాద్దాల పంపిణీ

దగదర్తి(బిట్రగుంట), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేదలకు కంటి పరీక్షల అనంతరం బుధవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. దగదర్తిలోని మాలేపాటి సోదరుల ఇంటి ఆవరణలో మాలేపాటి రవీంద్ర నాయుడు కుమారుడు, టీడీపీ యువనేత భానుచందర్‌నాయుడు పుట్టినరోజు సందర్భంగా మాలేపాటి రామానాయుడు చారటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి అభిమానులు కంచర్ల కృష్ణ, ఒట్టిగుంట గోపాలు, పేపల్ల సూరిబాబు, ముపాళ్ల వెంకటేశ్వర్లు వద్దినేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కళ్లాద్దాలు అందచేస్తున్న సుధాకర్‌నాయుడు

మోడల్ స్కూల్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

లింగసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి వరకు, జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఖాళీ సీట్ల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వసతి గృహంలో ప్రవేశానికి...

మోడల్ స్కూల్‌కు 5 కి.మీ దూరంలో ఉన్న 9వ తరగతి, జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థిను మోడల్ స్కూల్ ఆవరణలోని వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఆవరణలో నిర్మించిన బాలికల వసతి గృహంలో మొత్తం 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దూర ప్రాంతాల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చుండి మోడల్‌స్కూల్ వసతిగృహంలో...

వలేటివారిపాలెం : మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దూరప్రాంతాలకు చెందిన 9, 10, 11, 12వ తరగతుల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహంలో మొత్తం 50 సీట్లు మాత్రమే ఉన్నాయని, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

అట్టహాసంగా ఏరువాక పౌర్ణమి

కలిగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాడులో బుధవారం ఏరువాక పౌర్ణమి స్థానిక పొగాకుబోర్డు అధికారుల ఆధ్వర్యంలో రైతులు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి గుర్తుగా రైతులు జరుపుకునే ఏరువాక పౌర్ణమి పండుగ ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు పాడిపంటలతో అన్నదాత కుటుంబాలు సస్యశ్యామలంగా అండాలని బోర్డు అధికారులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు ద్వారా ఐదుగురు రైతులకు నవధాన్యాలు అందజేసి వాటిని స్థానిక రైతులతో కలిసి పొలాల్లో చల్లారు. ఈ కార్యక్రమంలో పొగాకుబోర్డు సూపరింటెండెంట్ నివేష్‌కుమార్ పాండే, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతు నాయకుడు రావూరి శ్రీకాంత్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు చల్లుతున్న పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు

భవిష్యత్ తరాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

● రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర 2047 ఆత్మకూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విజన్ ప్లాన్‌తో ఆత్మకూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు. ముందుగా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, విద్యుత్, సాంఘీక సంక్షేమ శాఖల అధికారులు రానున్న ఐదేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టనున్న స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలను మంత్రి ఆనంకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం, పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, పి-4 వంటి పది సూత్రాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ లక్ష్యమని అన్నారు. ఈనెల 12 నుంచి తల్లికి వందనం పథకాన్ని ప్రారంభిస్తామని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ. 20వేలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డీఎస్పీ రాజగోపాల్, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి, చీఫ్ ప్లానింగ్ అధికారి రఘురామయ్య, ఆర్అండ్‌బి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలు గంగాధర్ అశోక్‌కుమార్, వెంకటరమణ, పలువురు ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలుశాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సోమశిలలో 39.448 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 39.448 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 120 క్యూసెక్కులు వస్తుండగా పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

సీతారామపురం, : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ బిల్డింగ్ శ్లాబ్ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ప్రకాశం జిల్లా సిఎస్ పురం మండలం వడ్డిరాజు నగర్‌కు చెందిన బండారు సురేష్ (30) స్కూల్ బిల్డింగ్ శ్లాబ్ పనుల నిమిత్తం సీతారామపురం వచ్చాడు. డీసీఎం వ్యాన్, మిల్లర్ మధ్యలో ఉన్న లింకు తొలగించే క్రమంలో ఒక్కసారిగా మిల్లర్ సురేష్ మీదకు దూసుకెళ్లింది. దీంతో అతను తీవ్రంగా గాయపడడంతో 108 వాహనం ద్వారా ఉదయగిరి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ..

కలువాయి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చైన్నైలో చికిత్స పొందుతూ ఓ యువకుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. అనంతసాగరం మండలం పడమటి కంభంపాడుకు చెందిన శ్రీనివాసులు ఈ నెల 7న కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లికి వచ్చి తిరిగి పడమటి కంభంపాడుకు బైక్‌పై వెళ్తూ రాజుపాళెం సమీపంలో రాత్రి 9 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని 108లో ఆత్మకూరులోని వైద్యశాలకు తరలించి పరిస్థితి విషమంగా ఉండటంతో చైన్నైకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హడలెత్తించిన అట్టపెట్టె పార్సిల్

బిట్రగుంట : బోగోలు మండలం ఇబ్రహీంపేట హిందూ శ్మశానవాటికి సమీపంలో జమ్ముచెట్లలో పడి ఉన్న అట్టపెట్టె పార్సిల్‌ను బుధవారం గుర్తించిన స్థానికులు హడలిపోయారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ భోజ్యా సిబ్బందితో దానిని బయటకు తీయించి చూడగా అందులో ఖాళీ బీర్లు, మద్యం సీసాలు కనిపించాయి.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పసుపు, కుంకుమ



ఉదయగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గన్నేపల్లి పంచాయతీలో ఉన్న అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగం గా బుధవారం అమ్మవారికి పసుపు, కుంకుమ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గడ్డంవారిపల్లి, జెట్టి వారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో మేళ తాళాలు, బాణసంచా వేడుకల నడుమ ఆలయం వద్దకు చేరారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, కొట్టాలపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, రత్నమ్మ దంపతులు అమ్మవారికి రూ.2 లక్షల విలువైన బంగారు నగలను ఆలయ కమిటీకి అందజేశారు.

వైభవంగా సీతారామచంద్రుల కల్యాణం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : కాంచెరువులోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు.

గీతాశ్రమంలో హనుమాన్ చాలీసా

అల్లూరు : ఏరువాకా పూర్ణిమను పురస్కరించుకొని అల్లూరులోని గీతాశ్రమంలో బుధవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు అనంతరాజు బాలకృష్ణంరాజు తెలిపారు. హనుమాన్ చాలీసాన గూడూరుకు చెందిన సుబ్బారెడ్డి పాల్గొని భక్తుల చేత పఠింపజేశారు. ఈ కార్యక్రమంలో యరటపల్లి శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, కందల శివరామిరెడ్డి, నాగభూషణం, మొగళ్లపల్లి సురేష్ పాల్గొన్నారు.

కారు బోల్తా : ఆరుగురికి గాయాలు

కలువాయి : రహదారిపై ఉన్న గుంటను తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తా పడిన సంఘటన కోటూరుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. పెంచలకోన ఆలయంలో పూజారి శేషుస్వామి కుటుంబం ఆయన అత్తగారి ఊరు కనిగిరి వెళ్లి తిరిగి కారులో కోనకు వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆరుగురికి గాయాలు కాగా కలువాయిలో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు వెళ్లారు.

ఆత్మకూరు తహసీల్దారుగా పద్మజాకుమారి

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) ఆత్మకూరు మండల తహసీల్దారుగా పి పద్మజాకుమారి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసున్న వి సుధీర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా సంగం తహసీల్దారు సోమ్లానాయక్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, సుధీర్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో తహసీల్దారుగా పనిచేస్తున్న పి పద్మజాకుమారి బాధ్యతలు స్వీకరించారు.

ఇంకుడు గుంటలు నిర్మించాలి

అనంతసాగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఫారం పాండ్స్, ఇళ్ల వద్ద ఇంకుడు గుంటల నిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఏపీడీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎండీవో కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఉమామహేశ్వరరావుకు లోకం పోకడ రామచంద్రరావు స్మారక అవార్డు


కావలిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : లోకం పోకడ పత్రిక సంపాదకులు రామచంద్రుని రామచంద్రారావు స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును హైద్రాబాద్ రచన కళాశాల ప్రిన్సిపాల్, కావలి వాసి రేవూరి ఉమామహేశ్వరరావుకు అందజేశారు. సీనియర్ జర్నలిస్ట్ సిద్ధి జయప్రతాప్ రెడ్డి అధ్యక్షతన బుదవారం ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు పాల్గొని మాట్లాడుతూ రామచంద్రుని పేరిట కుటుంబ సభ్యులు ప్రతి ఏటా ఉత్తమ జర్నలిస్ట్ నగదు అవార్డు అందించడం మంచి సాంప్రదాయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు సోదరుడు పట్టాభిరామారావు, కళారత్న హంస అవార్డు గ్రహీత, మెజీషియన్ మాధవరావు, సీనియర్ జర్నలిస్ట్‌లు మస్తాన్, నున్నా మురళి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, విశ్రాంత ఎంపీడీవో కళాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటురోడ్డును ప్రారంభించిన సబ్ కలెక్టరు

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంటురోడ్డు, డ్రైన్‌లను సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బిట్రగుంట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో స్థల వివాదంలో పరస్పర దాడులకు దిగిన ఇరువర్గాల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భోజ్యా తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. నాటకరాణి బాబు ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో కంపచెట్లు దట్టంగా పెరగడంతో నాటకరాణి ధనుంజయ్య 4 రోజుల క్రితం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అయితే తన ఆధీనంలో ఉన్న స్థలంలో కంపచెట్లు ఎలా తొలగిస్తావని బాబు అడగటంతో మాటామాటా పెరిగి పరస్పర దాడులకు దిగారు. నాటకరాణి వెంకటరమణ, వెంకటరాయుడు, కృష్ణ, మరో ఐదుమంది దాడి చేశారని నాటకరాణి సునీత ఫిర్యాదు చేయగా నాటకరాణి సురేంద్ర, దుర్గయ్య, మరో ఐదుమంది దాడి చేసినట్లు నాటకరాణి బాబు ఫిర్యాదు చేశారు. వీటిపై కావలి రూరల్ సీఐ బీ.పాపారావు విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో వివాదాలు జరుగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.



నేటి నుంచి సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో గురువారం నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ బుధవారం తెలిపారు. 25 కిలోల ప్యాకెట్ల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని 1,867 పాఠశాలలకు 7,614 ప్యాకెట్లు, వసతిగృహాలకు 9,400 ప్యాకెట్లు, తిరుపతిలోని ఇస్కాన్ ద్వారా మధ్యాహ్న భోజనం పథకానికి 3,377 ప్యాకెట్లు, అక్షయపాత్ర ద్వారా 1,353 చొప్పున మొత్తం 21,744 ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా ప్రతి ప్యాకెట్‌పై క్యూఆర్‌కోడ్ అమలు చేసినట్లు చెప్పారు.





గతేడాది ఆగస్టు19న శ్రీసిటీలో సిద్ధార్థ లాజిస్టిక్స్‌కు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు

పరిశ్రమల ఖిల్లా మన జిల్లా

- జగన్ జమానాలో పరిశ్రమలు పరార్
- బాబు సారథ్యంలో వేల కోట్ల పెట్టుబడులు

ఐదేళ్ల అథోగతిలోంచి జిల్లా కోలుకుంటోంది. వైసీపీ అరాచకపాలనలో జిల్లాకు కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవే పరారయ్యాయి. ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి భరోసాగా ఉన్న అమరరాజ వంటి ప్రతిష్టాత్మక సంస్థలనే జగన్ జమానాలో ముప్పుతిప్పలు పెట్టారు. కొన్ని పరిశ్రమలను వాటాలకోసం వేధించారు. ఇసుక, గ్రావెల్, క్వారీల కొల్లగొట్టుడు పనుల్లో మునిగిపోయిన వైసీపీ నేతలు జిల్లా యువత భవిష్యత్తును గాలికొదిలేశారు. ఏడాది కిందట సరిగ్గా ఈరోజు.. జూన్ 12న చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్నాక జిల్లా పారిశ్రామిక చిత్రపటం రూపు మారడం మొదలైంది. కేవలం ఏడాదిలోనే రూ. 2765 కోట్ల పెట్టుబడులతో 20 పరిశ్రమలు ప్రారంభం అయ్యాయి. వాటి ద్వారా జిల్లాలో 5579 మందికి ఉద్యోగాలు లభించాయి. రూ 9 వేల కోట్ల పెట్టుబడులతో ఇంకో 19 పరిశ్రమలు జిల్లాలో మొదలు కానున్నాయి. జిల్లా యువత కళ్లలో ఆశా దీపాలు వెలిగించిన ఏడాదిగా దీనిని పేర్కొనవచ్చు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా జిల్లా పారిశ్రామిక ప్రగతి చిత్రం ఇది...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

20 పరిశ్రమలు 5,579 మందికి ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటి వరకూ జిల్లాలో రూ.2765 కోట్ల పెట్టుబడులతో 20 పరిశ్రమలు ప్రారంభం అయ్యాయి. దీనివల్ల 5579 మందికి ఉద్యోగాలు లభించాయి. నియోజకవర్గాల వారీగా చూస్తే సత్యవేడులో 14, శ్రీకాళహస్తిలో 3, గూడూరు, సూళ్ళూరుపేట, చంద్రగిరిలలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటయ్యాయి. ఏర్పేడు మండలం పరిధిలోని ఈఎంసీలో వింగ్ టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గూడూరు మండలం చెన్నూరులో కలర్‌షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎక్స్‌పోర్ట్స్), తడ మండలం మాంబట్టులో వీల్స్ ఇండియా లిమిటెడ్, తొట్టంబేడు మండలం తాటిపర్తిలో మంచుకొండ ప్రకాశం ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఈయా మెటల్ అండ్ అల్లాయ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి రెండు పరిశ్రమలు, కేవీబీపురం మండలం కొత్తూరులో బీఎస్ఆర్ సిలిండర్స్ ప్రైవేట్ లిమిటెడ్, చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో టాక్సజెన్ బయోల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.

శ్రీసిటీలోనే 13 పరిశ్రమలు

జిల్లాలో ఈ ఏడాది ఒక్క శ్రీసిటీలోనే ఏకంగా 13 పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. ఎల్జీ పాలిమర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నిండెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియోలింక్ టెలికమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్, జేజీఐ మెటల్ కన్వర్టర్స్, ఎవర్‌షైన్ మాడ్యులర్స్ లిమిటెడ్, ఆటో డేటా, ఎస్కే కాంపొనెంట్స్, అడ్మైర్ కేబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీ లక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేపీ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వంటి పరిశ్రమలు అందులో వున్నాయి.



మే8న ఎల్జీ సంస్థకు మంత్రి లోకేశ్ భూమిపూజ

సీఎం, లోకేశ్‌ల చొరవ

గత ప్రభుత్వ విధానాలతో నత్తనడకన సాగుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు పరుగులెత్తించారు. రూ. 8949 కోట్ల భారీ పెట్టుబడులతో 19 కొత్త పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటయ్యేందుకు భూములు కేటాయించారు. అవసరమైన అనుమతులు, రాయితీలు మంజూరు చేయించారు. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే జిల్లాలో యువతకు 20,536 ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఈ పరిశ్రమలకు సీఎం చంద్రబాబు 1420 ఎకరాల భూముల కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

| కొత్త పరిశ్రమలు ఎక్కడెక్కడంటే.... |

కొత్తగా జిల్లాలో ఏర్పాటు కానున్న 19 పరిశ్రమలలో కొన్ని భారీ పెట్టుబడులు కలిగిన సంస్థలు వుండగా, మరికొన్నింటిలో భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తొట్టంబేడు మండలం తాటిపర్తిలో అల్యూమినియం ఇంగాట్స్ తయారు చేసే ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన హిండల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 1700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతోంది. శ్రీసిటీలో మాండలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1600 కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఈ పరిశ్రమ చాక్‌లెట్ల తయారీకి ప్రపంచవ్యాప్తంగా పేరుమోసింది. ఇక్కడ తయారయ్యే చాక్లెట్లు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి కానున్నాయి. నాయుడుపేట మండలం పాలచ్చూరు వద్ద బిర్లా కార్బన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1200 కోట్ల పెట్టుబడితో కార్బన్ బ్లాకుల తయారీ యూనిట్ నెలకొల్పుతోంది. ఇదే మండలం మేనకూరులో గ్రేస్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 520 కోట్ల పెట్టుబడితో గ్రెయిన్ బేస్డ్ డిస్టిలరీ ఏర్పాటు చేస్తోంది. గూడూరు మండలం వేదిచెర్లలో రెడ్‌సన్ సీమ్‌లెస్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 437 కోట్లతో స్టీలు పైపుల తయారీ యూనిట్ పెడుతోంది.

ఆ రెండు పరిశ్రమల్లో 12 వేల మందికి ఉపాధి

కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలలో కేవలం రెండింటి ద్వారానే 12 వేల మందికి ఉపాధి కలగనుంది. శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద హిల్‌టాప్ ఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఫుట్ వేర్ తయారీ యూనిట్ నెలకొల్పుతోంది. అపాచీ గ్రూపులో భాగమైన ఈ సంస్థ రూ. 700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలో పది వేల మందికి ఉపాధి లభించనుంది. అలాగే సత్యవేడు మండలం కొల్లడం గ్రామం వద్ద ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ రూ. 380 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీ యూనిట్‌లో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

దుగరాజపట్నం నౌకా నిర్మాణ కేంద్రం



సీఎం చంద్రబాబు చొరవతో దుగరాజపట్నం వద్ద నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీనికి అవసరమైన భూములను గుర్తించే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా నడుస్తోంది. సముద్ర తీర ప్రాంతంలో ఐదు వేల ఎకరాల భూమి అవసరమని కేంద్రం స్పష్టం చేయడంతో జిల్లా యంత్రాంగం గూడూరు నియోజకవర్గ పరిధిలో సముద్ర తీర ప్రాంత భూములు పరిశీలిస్తోంది. అయితే అది షిప్ బిల్డింగ్ సెంటరా లేక షిప్ బ్రేకింగ్ సెంటరా అన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి వుంది.

■ ముగిసిన జ్యేష్ఠాభిషేకం



తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం బుధవారం ముగిసింది. చివరిరోజున బంగారు కవచంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి మెరిసిపోయారు. వచ్చే ఏడాది జరిగే జ్యేష్ఠాభిషేకం వరకు ఉత్సవర్లు ఈ స్వర్ణ కవచంలోనే ఉంటారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి


వీఆర్‌కు ఇద్దరు ఎస్ఐలు

- ముగ్గురికి పోస్టింగ్ ఇస్తూ ఎస్పీ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఎస్ఐలను వీఆర్‌కు పంపుతూ బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలిచ్చారు. జిల్లాలో కొందరు ఎస్ఐల పనితీరు, వ్యవహారశైలిపై ఇంటెలిజెన్సు స్పెషల్ బ్రాంచ్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. దీంతో వెంకటగిరి ఎస్ఐ జి.సుబ్బారావు, పాకాల ఎస్ఐ ఎంఎన్ సంజీవరాయుడును వీఆర్‌కు సాగనంపారు. ఇక, తిరుపతి ఈస్ట్‌లో పనిచేసి వీఆర్‌కు వెళ్లిన ఎస్ఐ బాలకృష్ణను ఎర్రావారిపాలేనికి.. తిరుపతి ఈస్ట్‌లోని రామాంజనేయులును తొట్టంబేడుకు, వీఆర్‌లోని మస్తానయ్యను వెంకటగిరికి బదిలీ చేశారు. వీరందరూ తక్షణం వారి స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. మరికొందరు సీఐలు, ఎస్ఐల పనితీరుపై నిఘా ఉంచినట్లు తెలిసింది.

■ గరుడుడిపై అమ్మవారు.. అయ్యవారు





తిరుచానూరులో పద్మావతిదేవి - అప్పలాయగుంటలో..

తిరుచానూరులో ఐదు రోజులు జరిగిన తెప్పోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పద్మావతి అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగారు. అలాగే, వడమాలపేట మండలం అప్పలాయగుంటలో జరిగే ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో స్వామివారు రాత్రి గరుడుడిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

- తిరుచానూరు/వడమాలపేట, ఆంధ్రజ్యోతి

రెవెన్యూశాఖలో బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెవెన్యూశాఖలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ నోడల్ అధికారి అయిన చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతృత్వంలో జరిగింది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించిన అనంతరం బదిలీల ప్రక్రియ చేపట్టారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి జిల్లాకు, తిరుపతి డీఎస్వో కార్యాలయంలో పనిచేస్తున్న రేఖను చిత్తూరుజిల్లాకు బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 24 మంది డీటీలకు అడహక్ పద్ధతిలో తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాలను కేటాయించారు. వీరిలో తిరుపతి జిల్లాకు.. శాంతి (ఆర్డీవో కార్యాలయం, శ్రీకాళహస్తి), తనూజ (డీఎస్వో కార్యాలయం, తిరుపతి)ను, చిత్తూరు జిల్లాకు కేటాయించిన వారిలో.. రాజేంద్ర (తిరుపతి), శ్రీనివాసులు (తిరుపతి), రాధిక (తిరుపతి) ఉన్నారు.

279మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

- ముగ్గురు డిప్యూటీ ఎంపీడీవోలు కూడా..

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 279 మంది పంచాయతీ కార్యదర్శులు బుధవారం రాత్రి బదిలీ అయ్యారు. గత ప్రభుత్వంలో గ్రేడ్‌తో సంబంధం లేకుండా కార్యదర్శులను నియమించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీలను విభజించింది. ఆ ప్రకారం అర్హులైన కార్యదర్శులను నియమించేలా చర్యలు చేపట్టింది. ఇక, ఇన్‌ఛార్జిలతో కొట్టుమిట్టాడుతున్న తిరుచానూరు మేజర్ పంచాయతీకి రేణిగుంట పంచాయతీ కార్యదర్శి పీఎస్ మణిని నియమించారు. అలాగే వివిధ మండలాల్లో ఈవోపీఆర్డీ(డిప్యూటీ ఎంపీడీవో)గా పనిచేస్తున్న ముగ్గురు బదిలీఅయ్యారు. సత్యవేడులోని తరుణాక్షరెడ్డిని కేవీబీపురానికి, తిరుపతి రూరల్‌లోని మాధురిని ఎర్రావారిపాళెంకు, వడమాలపేటలోని దయాసాగర్‌ను తిరుపతి రూరల్‌కు బదిలీ చేశారు. జిల్లాలో రెవెన్యూశాఖకు సంబంధించి పది మంది తహసీల్దార్లు, 17మంది డీటీలతోపాటు పలువురు వీఆర్వోలు కూడా బదిలీలయ్యారు. ఈ వివరాలు గురువారం అధికారికంగా వెలువడనున్నాయి. కాగా, ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా విజయవాడలో గురువారం జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు కలెక్టర్, జేసీ బుధవారం బయలుదేరి వెళ్లారు.

స్విమ్స్‌ను అత్యుత్తమ వ్యవస్థగా తీర్చిదిద్దుతాం





వేదికపై టీటీడీ చైర్మన్, చాన్సలర్ బీఆర్ నాయుడు, ముఖ్యఅతిథి హనుమంతరావు, టీటీడీ సభ్యురాలు సుచిత్ర తదితరులు - పట్టా తీసుకునే విద్యార్థులతో ప్రతిజ్ఞ

- స్నాతకోత్సవంలో చాన్సలర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌ను దేశంలో అత్యుత్తమ వ్యవస్థగా తీర్చిదిద్దుతామని స్విమ్స్ చాన్సలర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని మహతిలో బుధవారం జరిగిన స్విమ్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏటా స్విమ్స్‌కు టీటీడీ రూ.వంద కోట్లు వెచ్చిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాల కొరత లేకుండా మరో రూ.71 కోట్ల వరకు వెచ్చించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సేవలు, రోబోటిక్ శస్త్ర చికిత్సలు, ఆన్‌లైన్ ఓపీడీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్విమ్స్‌లో వేల మంది రోగులకు వైద్యసేవలతో పాటు వర్సిటీలో ఏటా వందల మంది వైద్యులను, సిబ్బందిని తీర్చిదిద్దుతుండటం గొప్ప విషయమని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ధనార్జనే ధ్యేయంగా కాకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ప్రాణాలు నిలబెట్టడంలో ప్రతిభ చూపాలని ముఖ్య అతిథి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ హనుమంతరావు డాక్టర్లకు సూచించారు. అధునాతన వైద్య పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించాలని వైద్య విద్యార్థులకు చెప్పారు. అనంతరం వైద్య విద్య పూర్తి చేసుకున్న 501 మందికి డాక్టర్ పట్టాలు, వైద్య విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందికి బంగారు పతకాలు, ఎంబీబీఎస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్లు అభిజ్ఞ, నికిత గిద్దానికి రూ.25 వేల నగదు బహుమతి, ఎక్కువ మార్కులు సాధించిన డాక్టర్లు నాగేంద్రప్రసాద్, బుద్దగారి ప్రేమ్‌కు మెరిట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రోగులకు నిస్వార్థ సేవ అందిస్తామంటూ డాక్టర్ పట్టాలు అందుకున్న వారితో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంకా టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డీఎంఈ అకడమిక్ డాక్టర్ రఘునందన్, స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, వైద్య విభాగాధిపతులు నరేంద్ర, జానకి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులకు స్థానచలనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి సత్యసాయి జిల్లాకు బదిలీకాగా.. ఆయన స్థానంలో కడప నుంచి భరత్‌కుమార్ రెడ్డిని నియమించారు. సమాచార పౌరసంబంధాలశాఖ(ఐఅండ్ పీఆర్) జిల్లా అధికారి బాలకొండయ్యను అనంతపురం జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం, ఆయన స్థానంలో గురుమూర్తిని నియమించింది. ఇక డీపీఆర్వోగా రమేష్ నియమితులయ్యారు.

నేటి నుంచి మోగనున్న బడిగంట

తిరుపతి(విద్య), జూన్ 11: వేసవి సెలవుల విరామం తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో సెలవుల్లో ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ఇక బడిబాట పట్టనున్నారు. జిల్లాలోని 3150 ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు తెరుచుకోబోతున్నాయి. 50 రోజుల విరామం తరువాత సుమారు 3 లక్షల పైచిలుకు విద్యార్థులు పాఠశాలలకు రానున్నారు.

నలుగురు రెవెన్యూ అధికారులపై చర్యలు

- నగరిలో ప్రభుత్వ భూమిని కాపాడకపోవడమే కారణం

చిత్తూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలో ఒకప్పుడు పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలపై చర్యలు తీసుకోమని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై మేజర్ పెనాల్టీ ఇంపోజ్ (కఠిన చర్యలు) చేయమని సీసీఎల్ఏకు సిఫార్సు చేశారు. ఈ నలుగురిలో ప్రస్తుత ఆర్‌సీపురం, వెదురుకుప్పం తహసీల్దార్లు వెంకటరమణ, బాబు, నగరి వీఆర్వో దేవదాసు, రిటైర్డ్ వీఆర్వో సదాశివపిళ్లై ఉన్నారు. వీరికి చార్జ్ మెమోలను ఇచ్చి, విచారణాధికారిని నియమించాక మేజర్ చర్యలు తీసుకుంటారు. ఈ చార్జెస్ ఉన్నంతవరకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందవు. ఇదంతా ఎందుకంటే.. 2018-20 మధ్య నగరి మండలంలో చెరువు, కుంట, దారిని ఆక్రమించి టెంకాయ చెట్లను సాగుచేస్తున్నారని ఓ సర్పంచి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు తమ హయాంలో ఈ నలుగురు అధికారులు చెట్లను తొలగించామని రిపోర్టు ఇచ్చారు. అయితే, చెట్లను తొలగించలేదని లోకాయుక్త విచారణలో తేలింది. ఆ తర్వాత తహసీల్దార్ చెట్లను తొలగించి లోకాయుక్తకు ఫొటోలు, వీడియోసహా నివేదిక ఇచ్చారు. గతంలో స్పందించని నలుగురిపై లోకాయుక్త సీసీఎల్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ ఆదేశాలు వచ్చాయి.

టెక్నాలజీ వినియోగంలో మనమే టాప్



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ కేంద్ర మంత్రికి వివరిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ వాడకంలో ప్రపంచంలోనే మన దేశం ముందుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. తిరుపతిలో బుధవారం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. ఎస్పీ హర్షవర్ధనరాజు విజ్ఞప్తి మేరకు సాయంత్రం జిల్లా పోలీసు రిజర్వు గ్రౌండుకు వచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్క నాటి మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు డ్రోన్ల వినియోగం, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. డ్రోన్లు పైకి ఎగురవేసి వాటి ద్వారా నేరస్థులు, గంజాయి వినియోగదారులు, రౌడీల ఆటకట్టించడం వంటి చర్యలకు ఎలా ఉపయోగపడుతున్నాయో మంత్రికి ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నేతలు కోలా ఆనంద్, వరప్రసాద్, మునిసుబ్రమ్మణ్యం, ఏఎస్పీలు నాగభూషణం(క్రైం), రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచ్చారి, శ్యాంసుందర్, సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అర్బన్‌హెల్త్ సెంటర్ నిర్మాణానికి చర్యలు: పాశం



అసంపూర్తిగా ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనం

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమసీదు ఎదురుగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించడానికి అవసరమైన రూ.36 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేయించి భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందని, హెల్త్ సెంటర్ భవనాన్ని పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమసీదు ఎదురుగా గతంలో ఉన్న ఫైలేరియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైసీపీ ప్రభుత్వంలో ఆ భవనాన్ని తొలగించారు. ఆ స్థలంలో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించడానికి 2021 మార్చి 10వ తేదీన శంఖుస్థాపన చేశారు. అయితే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ భవనాన్ని పూర్తి చేసి వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందిన క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా రాణించి గూడూరుకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఏఎస్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 రోజులు పాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామీణ స్థాయిలో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. స్టేడియాన్ని అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. నూతనంగా గ్యాలరీ, ఓపెన్‌జిమ్, ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టి క్రీడాకారులకు వసతులను మెరుగుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మునిగిరీష్, వేగూరు రాజేంద్రప్రసాద్, లవకుమార్, తూపిలి నాగేశ్వరరావు, దశరధరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, పేటేటి చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై దుష్ప్రచారం తగదు

పెళ్లకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధాని అమరావతిని పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తుంటే... వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం చిల్లకూరు, పాలచ్చూరు పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు ద్వారా నాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అక్కురపల్లి మాధవరెడ్డి, ఆకుతోట రమేష్, దామెర ప్రసాద్ నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందమూడి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



నిమ్మసాగులో మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు తిరుపాల్, బండెప్ప

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చునని వెంకటగిరికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ తిరుపాల్ అన్నారు. బుధవారం మండలంలోని పారిచెర్ల గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి నిమ్మ రైతులకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనిక ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం దెబ్బతింటుందన్నారు. కేంద్ర వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ బండెప్ప మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష చేసుకుని, అందుకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్ర మంలో ఏవో రమేష్, శివ, మమత, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచరణల నడుమ శాస్త్రోపేతంగా కల్యాణం జరిపారు. అనంతరం స్వామివారిని గజ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. బుధవారం ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకులో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ప్రసూన, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, సూర్యకాంతం, గౌరీ, షైలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రై సైకిల్‌లో చున్నీ తగులుకొని దివ్యాంగురాలి మృతి

చిట్టమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ట్రై సైకిల్‌లో చున్నీ తగులుకొని దివ్యాంగురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తాడిమేడు రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... నాయుడుపేట మండలం, గొట్టిప్రోలు అగచాట్లపురం కాలనీకి చెందిన దివ్యాంగురాలు పోలమ్మ(36) మరో దివ్యాంగుడితో కలసి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌లో కొత్తగుంటకు వెళ్లింది. తిరిగి అగచాట్లపురం గ్రామానికి వెళ్తుండగా తాడిమేడు రోడ్డు సమీపంలో పోలమ్మ మెడకు ఉన్న చున్నీ సైకిల్ చక్రానికి తగులుకొని బోల్తా కొట్టింది. చున్నీ పోలమ్మ మెడకు బిగుసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు

నాయుడుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్‌కం సెంటర్ వద్ద జరిగిన చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. గతేడాది డిసెంబరు 27వ తేదీన వెల్‌కం సెంటర్‌లో చోరీ జరిగింది. ఈ కేసులో తొట్టంబేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకటేష్, నాయుడుపేట పట్టణానికి చెందిన సతీష్‌కుమార్, వెంకటగిరికి చెందిన లోకేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



మున్సిపాలిటీ వీధి, బ్రాహ్మణవీధిలో అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు

అడుగడుగునా... స్పీడ్ బ్రేకర్లు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు ● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

నాయుడుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి వీధిలో అక్రమంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. విద్యాలయాలు, ప్రార్థనామందిరాలు, ప్రమాదకర ప్రాంతాల్లో మాత్రమే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఎత్తు 6 ఇంచులు, వెడల్పు 11 ఇంచులతో ఏటవాలుగా ఇరువైపులా వాహనాల రాకపోకలకు అనువుగా స్పీడ్ బ్రేకర్లు ఉండాలి. ఇందుకు భిన్నంగా పట్టణంలోని ప్రతి వీధిలో పరిమితికి మించిన ఎత్తుతో స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా ఇళ్ల ముందు కాంక్రీట్‌తో ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లుగా అమర్చుతున్నారు. ప్రధాన మార్గాలతో పాటు చిన్నచిన్న వీధుల్లోనూ ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్పీడ్ బ్రేకర్ల ఎత్తు ఎక్కువగా ఉండడంతో అడుగుభాగం తగిలి వాహనాలు దెబ్బతింటున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధిని చూడలేక వైసీపీ విషం చిమ్ముతోంది: విజయశ్రీ



రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయశ్రీ, ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

ఓజిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని విస్మరించిన వైసీపీ నేడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం భట్లకనుపూరు, చిల్లమానుచేను, భువనగిరిపాళెం మీదుగా చిల్లకూరు మండలం అయ్యవారిపాళెం వరకు రూ.8.38 కోట్లతో నిర్మించిన రోడ్డును బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిని దేవతల రాజధానిగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలను తట్టుకోలేని వైసీపీ మహిళలను కించపరిచేలా మాట్లాడడం దుర్మార్గమన్నారు. గతి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఏడాది కాలంలోనే అభివృద్ధి బాటలోకి తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషిని కొనియాడారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నామన్నారు. ప్రధానంగా రోడ్లను బాగు చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో ఈ ఏడాది కాలంలో రూ.27 కోట్ల వ్యయంతో రోడ్ల ఏర్పాటు, మరమ్మతులు చేపట్టామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధికి అంబాసిడర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, పంచాయతీరాజ్ ఈఈ రమణ, డీఈ సురేష్, ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఏఈలు సురేష్ చౌదరి, వీరాస్వామి, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, గున్నం సేవాట్రస్ట్ అధినేత గున్నం మధుసూధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బచ్చల రవీంద్రారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్, ఈశ్వరరాజు, సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కురుగొండ్ల



పొలాల్లో దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని పంజామ్ గ్రామంలోని భూముల్లో పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు అధునాతన వ్యవసాయ పనిముట్లను రైతులకు రాయితీతో అందించడం జరుగుతోందన్నారు. డక్కిలి మండలానికి మూడు, వెంకటగిరి, బాలాయపల్లి మండలాలకు ఒక్కొకటి చొప్పున ఐదు డ్రోన్‌లను 80 శాతం రాయితీతో రైతు సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ షన్ముగం, ఏడీ నాగార్జున, మూడు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని మహిళ ఆత్మహత్య

చిట్టమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలకలపూడి గ్రామానికి చెందిన రాజేశ్వరి (42) విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు... మొలకలపూడి గ్రామానికి చెందిన రాజేశ్వరి, ఆమె భర్త మణి మధ్య మంగళవారం రాత్రి గొడవ జరిగింది. మనస్తాపంతో రాజేశ్వరి విష గిళికలు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. నాయుడుపేట ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. రాజేశ్వరి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

అక్రమంగా చెట్ల నరివేత

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాళెం గ్రామ సమీపంలోని మర్రిపల్లెమడుగు కలుజుకట్ట ప్రాంతంలో కొందరు చెట్లను అక్రమంగా నరికివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బుధవారం కలుజుకు సమీపంలోని కట్టపై ఉన్న చెట్లను నరికివేసి కలపను తరలించారని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి చెందిన విలువైన కలపను అక్రమంగా తరలించడాన్ని అధికారులు అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

సిమెంటు రోడ్ల ప్రారంభం

వెంకటగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెట్లూరు, మొగళ్ళగుంట, పంజామ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, జీకేపల్లి బాబునాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

తడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో భాగంగా గురువారం అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని ఎంఈవో మల్లికార్జున్ తెలిపారు. బుధవారం పాఠ్యపుస్తకాలతో కూడిన విద్యా సామగ్రిని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం వినియోగిస్తారని చెప్పారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కోట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌కుమార్, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

5,520 మందికి స్టూడెంట్ కిట్లు

కోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకులాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 5,520 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్‌లను ఎంఈవో మస్తానయ్య బుధవారం పాఠశాలలకు పంపారు.

14న మండలస్థాయి యోగాంధ్ర

తడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్ నాయక్ తెలిపారు. అలాగే ఈనెల 19వ తేదీ భీములవారిపాళెం పడవలరేవు వద్ద ఉన్న రిసార్ట్‌లో జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన రాజేంద్ర స్థానికంగా ఓ దాబాలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఫుడ్ డెలివరీ ఇచ్చేందుకు మోటర్ సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయ పడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్మాగారంలో మెషిన్ వద్ద పనిచేస్తుండగా చేతికి గాయాలయ్యాయి. వెంటనే నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెన్నై తీసుకెళ్లారు.

బలిజలను బీసీ జాబితాలో చేర్చాలి

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల వెనుకబడిపోయారన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గూడూరు అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసును అందజేశారు. పారిశుధ్య కార్మికులకు డీఆర్‌సీ జీతాలు, కరువు భత్యం ఇవ్వాలని కోరారు. అలాగే గత సమ్మె కాలంలో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

శ్రీయుత జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము, తిరుపతి

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము

ఫారం-VII

(విభాగము 19(1) మరియు రూలు 25మరియు సబ్ రూల్ (1) మేరకు)

రూఢీ ప్రకటన

Rc.G3/e-37222/2025 Date: 27.05.2025

సెక్షన్ **19(1) భూ సేకరణ మరియు** పునరావాస మరియు పునఃస్థాపన **చట్టం 2013 రూల్ 25(1)** ప్రకారము సంక్రమించిన **అధికారాలను అనుసరించి ఈ** క్రింది షెడ్యూలు నిర్దిష్ట భూములను పెదయాచసముద్రం గ్రామము నందు సర్వే నెంబర్ 65-1,66-1 Etc.,విస్తీర్ణము ఎ.0.26సెంట్లు భూమిని ప్రజా హిత కార్యక్రమాలకు అనగా నూతనముగా నిర్మించదలచిన **కండలేరు రిజర్వాయర్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ దక్షిణ ప్రాంతములోని పారిశ్రామిక వాడలకు నీటిని సరఫరా చేయుటకు పైప్ లైన్** నిర్మాణము కొరకు భూమి కావలెనని మరియు భూసేకరణ అవసరమైయున్నదనియు ప్రకటించుచు ఇదే చట్టం లోని విభాగము 15 మేరకు ఆసక్తి గల వ్యక్తులను విచారించిన పిమ్మట ఈ క్రింది షెడ్యూలు లోని భూమిని సేకరించుటకు జిల్లా కలెక్టరు తిరుపతి వారు సంతృప్తి చెందియున్నారు. మరియు రిక్విజిషన్ బాడీ అనగా **ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ ఫ్రాష్ట్రక్చర్ కార్పోరేషన్ (ఏ.పీ.ఐ.ఐ.సీ)** వారు సదరు భూములకు కావలసిన నిధులు డిపాజిట్ చేసినట్లు తెలిపియున్నందున ఈ క్రింద కనబరచిన షెడ్యూలు దాఖల భూములకు డిక్లరేషన్ ఇవ్వడమైనది.

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలు నందు కనబరచిన పెదయాచసముద్రం గ్రామము నందుసర్వే నెంబర్ 65-1, 66-1 వగైరా, విస్తీర్ణము ఎ.0.26 సెంట్లు భూములను ప్రజాప్రయోజితా కార్యాక్రమాలకు అనగానూతనముగా నిర్మించదలచిన ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ ఫ్రాష్ట్రక్చర్ కార్పోరేషన్ (ఏపీఐఐసీ)ద్వారా నూతనముగా నిర్మించదలచిన "కండలేరు రిజర్వాయర్ నుంచి ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతములోని పారిశ్రామిక వాడలకు నీటిని సరఫరా చేయుటకు పైప్ లైన్ నిర్మాణము కొరకు భూమి కావలెనని మరియు భూసేకరణ అవసరమైనట్లు న్యాయమైన పరిహారము, పారదర్శకత, పునరావాస మరియు పునఃస్థాపన చట్టం 2013 లోని విభాగము 19(1) (కేంద్ర చట్టం 30/2013) ప్రకారము జిల్లా కలెక్టరు తిరుపతి వారి ఇందు మూలముగా ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా : **తిరుపతి** మండలము: **దక్కిలి** గ్రామము: **పెదయాచసముద్రం**

క్రమ సంఖ్య	సర్వే నెంబరు. సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	తరగతి	ఆసక్తి గల సంబందిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1.	65-1	0.80	0.03	పట్టా మాగాణి	1.తంబిశెట్టి అంకయ్య తండ్రి వెంకటస్వామి 2.తంబిశెట్టి రామయ్య తండ్రి వెంకటయ్య 3.తంబిశెట్టి రత్నం తండ్రి వెంకటస్వామి 4.తంబిశెట్టి వెంకటసుబ్బయ్య తండ్రి వెంకటస్వామి 5.తంబిశెట్టి వెంకటయ్య తండ్రి వెంకటస్వామి	66	73	72	61,64	..Nil..
2.	66-1	1.68	0.05	పట్టా మాగాణి	1.బందారు పెంచలరత్నం తండ్రి నరసింహులు 2.బందారు అశోక్ తండ్రి నరసింహులు 3.తంబిశెట్టి యల్లయ్య	67	65	71	61	..Nil..
3.	67-1	0.90	0.03	పట్టా మాగాణి	1. కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.కొండ్రెడ్డి కృష్ణారెడ్డి తండ్రి పుల్లారెడ్డి	68,70	66	71	60,61	..Nil..
4.	67-4	1.73	0.01	పట్టా మాగాణి	1. కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.కొండ్రెడ్డి చంద్ర రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	68,70	66	71	60,61	..Nil..
5.	67-5	0.11	0.01	పట్టా మాగాణి	కొండ్రెడ్డి కృష్ణారెడ్డి తండ్రి పుల్లారెడ్డి	68,70	66	71	60,61	..Nil..
6.	67-6	2.04	0.03	పట్టా మాగాణి	1. కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.కొండ్రెడ్డి చంద్ర రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	68,70	66	71	60,61	..Nil..
7.	68-3	0.50	0.01	పట్టా మాగాణి	1. కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.వెలికింటి శివశంకర్ తండ్రి తిరుపాలయ్య	పలుగోడు గ్రామ సరిహద్దు	67	70,69	60	..Nil..
8.	68-6	0.17	0.01	పట్టా మాగాణి	వెలికింటి శివశంకర్ తండ్రి తిరుపాలయ్య	పలుగోడు గ్రామ సరిహద్దు	67	70,69	60	..Nil..
9.	68-7	0.19	0.01	పట్టా మాగాణి	వెలికింటి చలపతి తండ్రి తిరుపాలయ్య	పలుగోడు గ్రామ సరిహద్దు	67	70,69	60	..Nil..
10.	68-8	0.82	0.03	పట్టా మాగాణి	1.వెలికింటి చలపతి తండ్రి తిరుపాలయ్య 2.వెలికింటి శివశంకర్ తండ్రి తిరుపాలయ్య	పలుగోడు గ్రామ సరిహద్దు	67	70,69	60	..Nil..
11.	65-2	0.14	0.01	అనాదీనం మాగాణి	1.తంబిశెట్టి వెంకటసుబ్బయ్య తండ్రి వెంకటస్వామి 2. తంబిశెట్టి వెంకటయ్య తండ్రి వెంకటస్వామి 3. తంబిశెట్టి వెంకటయ్య	66	73	72	61,64	..Nil..
12.	65-9	0.48	0.03	అనాదీనం మాగాణి	1.తంబిశెట్టి రామయ్య తండ్రి వెంకటయ్య 2. తంబిశెట్టి వెంకటయ్య తండ్రి వెంకటస్వామి 3. తంబిశెట్టి వెంకటపతి తండ్రి వెంకటయ్య	66	73	72	61,64	..Nil..
	మొత్తం		0.26							

పై భూముల యొక్క వివరములు భూ సేకరణ కార్యాలయము/సబ్ కలెక్టరు, గూడూరు వారి కార్యాలయము నందు అందుబాటులో ఉంచబడును. ఆసక్తి గల వ్యక్తులు కార్యాలయ పని వేళలో హాజరై పరిశీలన చేసుకోగలరు. ఈ భూ సేకరణలో స్థానభ్రంశము నకు గురి అయిన కుటుంబాలు ఏమియును లేవని తెలుపడమైనది.

భూ సేకరణ కారణంగా పునరావాసం పొందే అవ్వకాశం ఉన్న కుటుంబాల సంఖ్య ఏమియు లేవు. పునారావాస ప్రాంతం వివరాలు ఇలా ఉన్నాయి.

వరుస నెంబరు	గ్రామము పేరు	మండలము పేరు	జిల్లా పేరు	మొత్తం విస్తీర్ణం
- లేవు -				

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భుమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటె అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భుభాగాములను మాత్రమే ఉపయోగించవలేను.

Sd/- **Dr. VENKATESWAR. S,** I.A.S.,
Collector & District Magistrate, Tirupati District